ఏపి సచివాలయంలో వైద్యఆరోగ్య శాఖమంత్రితో మంత్రి మండిపల్లి

వైఎస్ఆర్-అన్నమయ్య వార్త

తెలుగు జాతీయ దినపత్రిక

బుధవారం 06 నవంబర్ 2024

రాష్ట్ర సబ్ జూనియర్స్ బాట్మింటన్‌షిప్ లో భాగంగా బాట్మింటన్ ఆడుతున్న మంత్రి మండిపల్లి

ప్రజాస్వామ్యబద్ధంగా ప్రభుత్వ పాలన సాగుతోంది

రాష్ట్ర వెనుకబడిన తరగతులు, బలహీనవర్గాల సంక్షేమశాఖ, చేనేతజౌళి శాఖామంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి సవిత

ముఖ్యమంత్రి ఆలోచనా విధానాలకు అనుగుణంగా జిల్లా అభివృద్ధికి పాటుపడతాం

కడప, నవంబర్ 5, ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య బద్ధంగా, ప్రజల కోసం పనిచేస్తోందని, ఆ దిశగా జిల్లా సమగ్ర, అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా ఇంచార్జి మంత్రి సవిత పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా ఇంచార్జి కలెక్టర్ అదితిసింగ్ ఆధ్వర్యంలో జిల్లా ఇంచార్జి మంత్రి సవిత అధ్యక్షతన అన్ని శాఖల అధికారులతో జిల్లాస్థాయి సమీక్షా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు రామచంద్రారెడ్డి, రాంగోపాల్‌రెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి, బద్వేలు ఎమ్మెల్యే దాసరి సుధ, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి మంత్రి సవిత మాట్లాడుతూ గత చరిత్ర చూస్తే 2014-19లో రాష్ట్రంలో ఎక్కువశాతం రోడ్లు వేసిన ఘనత టిడిపి ప్రభుత్వానికే దక్కుతుందని, గత ప్రభుత్వ పాలనలో రోడ్లను పట్టించుకోలేదన్నారు. జిల్లాలో ఏదైనా కల్వర్టులు, బ్రిడ్జిల మరమ్మత్తులు ఉంటే వెంటనే వాటికి ప్రతిపాదనలు పంపించాలని అధికారులకు సూచించారు. సంక్రాంతి లోగా నాణ్యతగా పనులన్నీ పూర్తి చేయాలన్నారు. ఆర్‌అండ్‌బి శాఖ ద్వారా వివిధ పథకాల కింద జరుగుతున్న పనుల వివరాలను అధికారులు అడిగి తెలుసుకుని తగు సూచనలు జారీ చేశారు. జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందాలన్నారు. అందుకు అనుగుణంగా అధికారులు క్షేత్రస్థాయిలో బాధ్యతాయుతంగా కృషి చేయాలన్నారు. పారదర్శకత, అవినీతి రహిత పాలనే లక్ష్యంగా నడుస్తున్న రాష్ట్ర సిఎం నారాచంద్రబాబునాయుడు గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై ప్రక్షాళన చేస్తున్నారన్నారు. ప్రజలకు ఒక జవాబుదారీతనంతో సుపరిపాలన అందిస్తూ స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యసాధనకు కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ ఆశయసాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజల కోసం ప్రభుత్వం పనిచేస్తోందని జిల్లా సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అభివృద్ధి సంక్షేమం, ప్రజలకు పారదర్శక పాలనను అందించడమే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. భవిష్యత్తులో కూడా సిఎం ఆలోచనా విధానాన్ని అందుకుని స్వర్ణాంధ్ర 2047 విజన్ సాకారం దిశగా వైఎస్ఆర్ కడప జిల్లాను అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సవన్వయంతో కృషి చేద్దామన్నారు. రాష్ట్రాభివృద్ధికి సిఎం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కార్యక్రమాలను జిల్లాస్థాయిలో సక్రమంగా, విజయవంతంగా అమలు చేయడం అధికారుల బాధ్యత అన్నారు. ప్రభుత్వంలో భాగస్వాములైన జిల్లా కలెక్టర్ నుంచి అధికారులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు అందరూ జిల్లా అభివృద్ధిలో భాగస్వాములై అర్హులైన వారందరికీ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేయాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఇరువురూ సమన్వయంతో పనిచేసి పారదర్శకంగా సంక్షేమ కార్యక్రమాలను అందించాలన్నారు. అధికారులు విధులు సక్రమంగా నిర్వహించి జిల్లా అభివృద్ధికి పాటుపడాలన్నారు. పథకాల అమలు విషయంలో అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా ఇంచార్జి కలెక్టర్ అదితిసింగ్ మాట్లాడుతూ శాఖలవారీగా జిల్లాలో సాధించిన ప్రగతిని ఇంచార్జి కలెక్టర్ పవర్‌పాయింట్ ద్వారా ఇంచార్జి మంత్రికి వివరించారు.

గత ప్రభుత్వంలో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాలి

గత ప్రభుత్వంలో గృహనిర్మాణ పథకంలో జరిగిన గృహనిర్మాణాలలో భారీ అవినీతి చోటు చేసుకుందని, దీనిపై ప్రభుత్వం చేపట్టిన విజిలెన్స్ ఎంక్వైయిరీ పూర్తయినా కూడా నిజాలు వెల్లడి కాకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. మున్సిపాలిటీ పరిధిలోని టిడ్కో ఇల్లను కూల్చేసి జగనన్న కాలనీని నిర్మించడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాలి. **- వరదరాజులరెడ్డి, ఎమ్మెల్యే ప్రొద్దుటూరు.**

వ్యవసాయంపై అవగాహన కల్పించాలి

కొండాపురం 108 సేవలు నిలిచిపోయాయని, సేవలను పునరుద్ధరించాలి. జిల్లాలో వ్యవసాయ సాంకేతికతపై గ్రామీణ రైతుల్లో విస్తృత అవగాహన కల్పించాలి. ఆ దిశగా వ్యవసాయ అనుబంధ రంగాలను పటిష్టం చేసే దిశగా చర్యలు తీసుకోవాలి.

- ఆదినారాయణరెడ్డి, ఎమ్మెల్యే జమ్మలమడుగు.

హాస్టల్ల నిర్వహణ సరిగా లేదు

జిల్లాలో బిసి సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలికల హాస్టల్ నిర్వహణ సరిగాలేదని, సరైన మౌలిక వసతులు లేవని, తక్షణమే ప్రైవేటు రెంటెడ్ భవనంలోకి మార్పు చేయడంకాని, లేదా అన్ని సదుపాయాలు ఉన్న ప్రభుత్వ భవనాన్ని కానీ కేటాయించాలి. అలాగే బిసి వెల్ఫేర్ హాస్టల్లలో గడువు ముగిసిన చిక్కీలను సరఫరా చేయడం జరుగుతుందని, తక్షణమే చర్యలు తీసుకోవాలి. అలాగే కడప కార్పొరేషన్ పరిధిలో దాదాపు 15వేల కుటుంబాలకు తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారని, జల్‌జీవన్ మిషన్ పథకాన్ని కడప నగర కార్పొరేషన్‌లో నిధుల దుర్వినియోగం జరుగుతోందని, పరిశీలించాలి.

- మాధవిరెడ్డి, ఎమ్మెల్యే కడప.

9న కడపజిల్లాకు సిఎం రాక

కడప, నవంబర్ 5, ప్రభాతవార్త

ఈ నెల 9వ తేదిన కడప జిల్లాకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రానున్నారు. ఈ మేరకు అధికారిక ప్రకటన విడుదలైంది. కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం గండికోటకు రానున్నట్లు ఇంచార్జి కలెక్టర్ అదితి సింగ్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా గెలిచాక మొదటిసారిగా జిల్లాకు రానుండడంతో ఏర్పాట్లను ముమ్మరం చేశారు.

మంత్రి సవితకు ఘన స్వాగతం

పులివెందుల, నవంబరు 5, ప్రభాతవార్త ః

రాష్ట్ర చేనేతశాఖ మంత్రి, కడప జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవితకు పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) ఆధ్వర్యంలో తెలుగు తమ్ముళ్లు మంగళవారం ఘన స్వాగతం పలికారు. కడప జిల్లా పర్యటనలో భాగంగా పులివెందుల మీదుగా ఆమె కడపకు వెళ్లారు. ఈ మార్గమధ్యంలో ఉన్న పులివెందులలోని తెదేపా కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పులివెందుల నియోజకవర్గంలోని తెదేపా నాయకులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. తెదేపా కార్యాలయాన్ని మంత్రి సవిత సందర్శించిన అనంతరం పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి బీటెక్ రవితో పులివెందుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక తెదేపా నాయకులను బీటెక్ రవి మంత్రికి పరిచయం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పులివెందులలోని తెదేపా నాయకులు, కార్యకర్తల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. కార్యకర్తలకు తెదేపా ఎప్పుడూ అండగా ఉంటుందని, ప్రతి కార్యకర్తకు తప్పకుండా న్యాయం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు తూగుట్ల రాఘవరెడ్డి, దేవిరెడ్డి సంజీవరెడ్డి, అక్కులుగారి విజయ్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే ప్రక్రియలో వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి

రాయచోటి, నవంబరు 5, ప్రభాతవార్త:

రీ సర్వే ప్రక్రియలో వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం వెలగపూడి సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంయుక్త కలెక్టర్లు సర్వే శాఖాధికారులతో సీసీఎల్ఏ జయలక్ష్మీ రీ సర్వే ప్రక్రియపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని వీసీ హాలు నుంచి జిల్లా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీసీఎల్ఏ జయలక్ష్మీ మాట్లాడుతూ ఏపీలో 6860 గ్రామాల్లో రీ సర్వే ప్రక్రియ పూర్తయిందని, రీ సర్వే ప్రక్రియ పూర్తయిన గ్రామాల్లో గ్రామసభల ద్వారా వచ్చిన సమస్యలు, అర్జీలపై జిల్లా కలెక్టర్లు, సర్వే శాఖాధికారులు వెంటనే చర్యలు తీసుకొని సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో ఇప్పటి వరకు జరిగిన గ్రామసభలలో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, సర్వేశాఖాధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్ఓ మధుసూదన్‌రావు, ఏడీసర్వే భరత్ పాల్గొన్నారు.

సివిల్స్ ఉచిత శిక్షణకు 25మంది అభ్యర్థుల ఎంపిక

ప్రొద్దుటూరు అర్బన్, నవంబర్ 05, ప్రభాతవార్త:

స్థానిక కొర్రపాడు రోడ్డులోని కామిశెట్టి సుబ్బారావు చెన్నమ్మ డిగ్రీ కళాశాలలో ఆదివారం జరిగిన సివిల్స్ ఉచిత శిక్షణ అర్హత పరీక్షకు రాత మరియు మౌఖిక పరీక్ష ద్వారా 25మంది ఎంపికైనట్లు టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి తెలిపారు. సంస్కృతి స్వచ్ఛంద సంస్థ మరియు డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ అకాడమీ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ ఉచిత శిక్షణ కార్యక్రమం ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని మహిళలు సద్వినియోగం చేసుకోవాలి. ఎంపికైన వారు హైదరాబాద్ అశోక్ నగర్‌లో గల డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ అకాడమీలో ఉచిత శిక్షణ తీసుంటారు. అలాగే గ్రూప్ 1, 2 పరీక్షల ప్రిలిమినరికి ఎంపికైన పురుషులకు కూడ అర్హత పరీక్ష పెట్టి ఉచితంగా శిక్షణ అందజేస్తాము. ఆసక్తి ఉన్న వారు 99493 32920 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్కృతి స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి, ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ వరుణ్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించడంలో కూటమి ప్రభుత్వం వైఫల్యం

మాజీ ఎమ్మెల్యే, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ధ్వజం

ప్రొద్దుటూరు, నవంబర్ 05, ప్రభాతవార్త:

రాష్ట్రంలో మహిళలకు, ఆడబిడ్డలకు రక్షణ కల్పించడంలో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం స్థానిక వైసీపీ నాయకులు పోరెడ్డి నరసింహారెడ్డి నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఐదు నెలలు పూర్తి కాకముందే వందమంది మహిళలు, ఆడబిడ్డలపై అఘాయిత్యాలు జరగడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శణం అని విమర్శించారు. రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా జరిగిన సంఘటనపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించి ఉంటే ఈ ఘటనలు జరిగి ఉండేవి కావని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ఉదాసీనత, అఘాయిత్యాలు చేసే వ్యక్తికి ఆజ్యం పోసినట్లు అయిందని విమర్శించారు. ముందుగానే ప్రభుత్వం అలాంటి వ్యక్తులపై కఠినంగా వ్యవహరించి కఠిన శిక్షలు పడేలా చట్టాలను మార్చాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో మహిళలు మరియు ఆడబిడ్డలపై జరుగుతున్న అఘాయిత్యాలపై డిప్యూటి సీఎం పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలు ప్రభుత్వం విఫలం చెందిందని స్పష్టమవుతుందని అన్నారు. అలాగే ఈ ఘటనలపై హోం మంత్రి బాధ్యత తీసుకోవాల్సి ఉందని లేకపోతే రాష్ట్రంలో ఆడబిడ్డలకు రక్షణ లేకుండా పోతుందని సూచించిన సంగతిని ఆయన గుర్తు చేశారు. నిత్యం కూటమి ప్రభుత్వ గొప్పలు చెప్పుకోవడం లేదా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్‌మోహన్ రెడ్డి ఆస్థులపై వ్యక్తిత్వంపై దుష్ప్రచారానికి దిగడం ముఖ్యమంత్రి చంద్రబాబుకే చెల్లిందన్నారు. రాష్ట్రంలో ఇంత మంది ఆడబిడ్డలు తమ మానప్రాణాలు భద్రత లేకుఆ ఉంటే ప్రభుత్వం ఏర్పాటుచేసి ఐదు నెలలు కావస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. కేవలం చంద్రబాబు గొప్పలు చెప్పుకోవడం, ప్రతిపక్ష నాయకులపై వ్యక్తిగత ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. అలాగే ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కూడ కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆయన దుయ్యబట్టారు. అందుకే రాష్ట్రాన్ని పాలించే అర్హత కూటమి ప్రభుత్వం కోల్పోయిందని తక్షణమే ప్రభుత్వం నుండి వైదొలగాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం శాంతి భద్రతల విశయంలో కఠినంగా వ్యవహరించక ఇలాంటి సంఘటనలు మరోకసారి పునరావృతమైతే ప్రొద్దుటూరును వేదికగా చేసుకొని తీవ్రమైన ఉద్యమం చేస్తానని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మిదేవి నాగరాజు, కో ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షులు ద్వార్శల భాస్కర్ రెడ్డి, కౌన్సిలర్లు భూమిరెడ్డి వంశీధర్ రెడ్డి, పాతకోట ముని వంశీధర్ రెడ్డి, మన్నే సత్యం, గుర్రం లావణ్య, వై.జయంతి తదితరులు పాల్గొన్నారు.

అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రొద్దుటూరు, నవంబర్ 05, ప్రభాతవార్త:

ప్రొద్దుటూరు పట్టణంలోని అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ 1988-1989 బ్యాచ్‌కు సంబంధించిన పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం డిసెంబర్ 22వ తేది ప్రొద్దుటూరు అనిబిసెంట్ మైదానంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా జరపనున్నట్లు పూర్వపు విద్యార్థులు కట్టా రాంప్రసాద్, కంభం వెంకటేశ్వర్లు తెలిపారు. కావున మిత్రులారా ఇంకా ఎవరైనా ఈ బ్యాచ్‌కు సంబంధించిన వారుంటే తప్పక సమ్మేళనంలో పాల్గొనాలని పత్రికా ముఖంగా వారు తెలిపారు. 1988-89 బ్యాచ్‌కి చెందిన వారు ఎవరైనా ఉంటే మరిన్ని వివరాలకై కట్టా రాంప్రసాద్ సెల్ నెం.99493 33742, కంభం వెంకటేశ్వర్లు సెల్ నెం.70757 79555, వెంకట్ సెల్ నెం.94901 34171 అనే నంబర్లకు సంప్రదించాలన్నారు.

6వ రోజుకు చేరిన నామా ఎరుకలయ్య స్వామి ఆరాధనోత్సవాలు

ప్రొద్దుటూరు అర్బన్, నవంబర్ 05, ప్రభాతవార్త:

స్థానిక గీతాశ్రమం వీధిలో ఉన్న ఎరు కలయ్య ఆశ్రమం నందు జరుగుతున్న నా మా ఏకరసానందగిరి స్వామి, కమాలక్షుమ్మ ఆరాధనా ఉత్సవాలలో భాగంగా 6వ రోజు మంగళవారం ఎరుకలయ్య స్వామి, కమాల క్షుమ్మ మూలవిరాట్టులకు నిత్య పూజలు, గీ తా పారాయణం, అర్చన, కుంకుమార్చన, ప్రసాద వినియోగం కార్యక్రమాలు నిర్వహిం చారు. సాయంత్రం తాళాల హరిభజన, మ హిళలతో కోలాటం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ రామచంద్రాచార్యులు, సిబ్బంది విజయ్, శా రదా, జూనియర్ కాలేజి కరస్పాండెంట్ సురేష్ బాబు రెడ్డి, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

కార్తీకమాసంలో హనుమంతునికి ప్రత్యేక పూజలు

బద్వేలు అర్బన్, నవంబరు5 ప్రభాతవార్త :

కార్తీకమాసం పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని సిద్ధవటం రోడ్డులో వెలసిన శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వెంకటేశ్వరస్వామి, అభయాంజనేయ స్వామి దేవాలయంలో ఆలయ పూజారి వీరేశాచార్యులు ఆధ్వర్యంలో ఆంజనేయస్వామికి అభిషేకం, సిందూరం అర్చన, ఆకుపూజ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కార్తీకమాసం సందర్భంగా తెల్లవారుజామునుంచే భక్తులందరూ స్వామివారి ధ్వజ స్థంబాలవద్ద కార్తీక దీపాలు వెలిగించి భక్తి, శ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని తమ భక్తిని చాటుకున్నారు.ప్రత్యేక ఉభయదాతలుగా తుమ్మలపెంట సురేష్‌బాబు, సతీమణి జయప్రదాదేవి, అన్నప్ప, సతీమణి సింగరమ్మ కుటుంబ సభ్యులకు స్వామివారి సన్నిధిలో విశేష పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు వి.వి.రమణ పలువురు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజర్ రమణతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఇంకా ఎన్నాళ్లు ఈ కష్టాలు : కంపు బాబోయ్ కంపు

- నూతన డ్రైనేజీ కాలువలను ఏర్పాటు చేయాలి -దుర్వాసనతో తప్పని తిప్పలు

బద్వేలు అర్బన్, నవంబరు 05(ప్రభాతవార్త) :

బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని నెల్లూరు రోడ్డు సరస్వతి పాఠశాల సందులో అనేక సంవత్సరాలుగా డ్రైనేజీ కాలువ పూర్తిస్థాయిలో స్థంభించి మురికినీరంతా ఇండ్ల సందులో నిల్వ ఉండడంతో దుర్వాసనతో అనేక ఇబ్బందులకు, వ్యాధులకు గురికావలసిన పరిస్థితి ఆంజనేయనగర్‌లో నెలకొందని కాలనీవాసులు పలువురు వాపోతున్నారు. ముఖ్యంగా ఇటీవల పడిన కొద్దిపాటి వర్షాలకు జలుబు, దగ్గు, విషజ్వరాల బారిన పడి అనేక మంది ఆసుపత్రులలో వైద్య చికిత్సలు చేయించుకుంటున్నారు. అయితే సాయంకాలం సమయానికి దుర్వాసనతో మురికి నీటిలో వాలిన దోమలు ఇంట్లోకి అధికంగా వస్తూ దోమకాటుకు గురై ఇబ్బంది పడుతున్నామని కావున ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు చొరవ తీసుకుని ఆంజనేయనగర్‌లో మురికినీటి కాలువలను పరిశుభ్రం చేసేలా చర్యలు చేపట్టాలని, అలాగే నూతన డ్రైనేజీ కాలువలను నిర్మించాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు. సరస్వతి పాఠశాల సందులో నెలకొన్న డ్రైనేజీ సమస్యను ఇప్పటికీ అనేక సంవత్సరాలుగా నాయకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ఫలితం లేదన్నారు. నాయకులు ఎన్నికల సమయంలో మాత్రం హామీలు ఇచ్చారన్నారు. ఎన్నికల అనంతరం వాటిని విస్మరించడం బాధాకరమన్నారు. ఇంకా ఏన్నాళ్లీ కష్టాలని ఆ ప్రాంత వాసులు వాపోతున్నారు. తాము కరెక్టుగా మున్సిపాలిటీకి ఇంటిపన్నులు, కుళాయి పన్నులు చెల్లిస్తున్నామని అయినా తమకీ పరిస్థితి ఏమిటనీ పలువురు వాపోతున్నారు.

డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయాలి:

నిత్యం మురికినీటి సమస్యతో ఈ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతూ నరకప్రాయంగా ఉంటోంది. సాదారణ రోజులలో ఇలా ఉంటే వర్షాకాలంలో మా పరిస్థితి చెప్పనక్కరలేదు. రాత్రి సమయంలో దోమలతో ప్రశాంతంగా కనీసం నిద్రపోయేందుకు కూడా లేదని,అలాగే పందులు మురికినీటిలో పొర్లాడుతూ సంచరిస్తుండడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నాం. మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచాలని తెలియజేసే నూతన మున్సిపల్ కమిషనర్ అయినా మా సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసుల తరపున కోరుతున్నాం.

- గంపా మల్లెంకొండయ్య, ఆంజనేయనగర్, బద్వేలు

కమిషనర్ వివరణ : ఆంజనేయనగర్‌లో నెలకొన్న డ్రైనేజీ సమస్యను మున్సిపల్ కమిషనర్ వాకమళ్ల నరసింహారెడ్డి దృష్టికి తీసుకుపోగా స్పందించిన కమిషనర్ 10వ వార్డు ఆంజనేయనగర్‌ను పరిశీలించి డ్రైనేజీ నీరు వెళ్లేందుకు సిబ్బందితో కలిసి చర్యలు చేపడతామన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో హైస్కూల్‌లో పరిశుభ్రత

దువ్వూరు, నవంబర్ 05, ప్రభాతవార్త:

స్థానిక పుల్లారెడ్డి పేటలో జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణంలో ఉన్న పిచ్చిమొక్కలు, కంపచెట్లు, గడ్డి తదితర అపరిశుభ్రత వాతవరణం ఉండగా దానిని దువ్వూరు పోలీసులు ఆధ్వర్యంలో మంగళవారం పరిశుభ్రత చేయించారు. ఈ సంధర్భంగా ఎస్ఐ వినోద్ కుమార్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ రాజేంద్రప్రసాద్, సీఐ శివశంకర్ ఆధ్వర్యంలో ఈ పిచ్చి మొక్కలు తోలగింపు కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. విధ్యార్థులకు అనుగుణంగా ఆట స్థలాన్ని కూడ శుభ్రం చేయిస్తామని, అలాగే రహదారికి కూడ మరమ్మత్తులు పోలీసుల ఆధ్వర్యంలో చేపడతామని హామి ఇచ్చారు. సామాజిక సేవ కార్యక్రమాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.

పసుపులో నూతన పద్ధతులు పాటించాలి

దువ్వూరు, నవంబర్ 05, ప్రభాతవార్త:

మండల పరిధిలోని కృష్ణంపల్లె, బయనపల్లె గ్రామాల్లో రైతులు ఎక్కువగా పసుపు పంటను సాగు చేస్తారని వారు నూతన పద్ధతులు పాటించాలని జాబ్ బూస్టర్ ఇండియా ప్రోగ్రాం ఆఫీసర్ దేవసహాయం అన్నారు. ఈ సంధఱ్భంగా ఆయన మాట్లాడుతూ పసుపు రైతుల సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు శిక్షణా కార్యక్రమం ఏర్పాటుచేశామని ప్రధానంగా వ్యవసాయ పద్ధతులు, పంట యాజమాన్య పద్ధతులు ఉపయోగాలు, సాంకేతికతతో వ్యవసాయం, అటవీ వ్యవస్థ తదితర వాటిని గురించి వివరించారు. అలాగే మహిళా రైతులకు కూలీలకు పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు డాక్టర్ జోసఫర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రెండు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఐదుగురు గంజాయి స్మగ్లర్లు అరెస్ట్

చాపాడు, నవంబర్ 05, ప్రభాతవార్త:

మండలంలోని మడూరు గ్రామ పంచాయతీ చెంచుపల్లె చెరువు వద్ద మంగళవారం ఐదుగురు గంజాయి స్మగ్లర్లను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 1700గ్రాముల గంజాయిని సీజ్ చేసి ముద్దాయిలను అరెస్ట్ చేసినట్లు మైదుకూరు రూరల్ సీఐ శివశంకర్, చాపాడు ఎస్ఐ చిన్న పెద్దయ్యలు తెలిపారు. ఈ సంధర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గుంటూరు జిల్లా సత్తెనపల్లి మండలం కొమరపూడి గ్రామానికి చెందిన తిరుమల రావు అనే ముద్దాయి, ప్రొద్దుటూరు ప్రాంతానికి చెందిన మేకల సునీల్, సురసుర శ్రీనివాసులు, గుర్రం రమేష్, పాపగాళ్ల సుధీర్ అనే వ్యక్తులకు సరఫరా చేస్తూ ఉండగా పోలీసుల ముందస్తు సమాచారం మేరకు మత్తు పదార్థమైన గంజాయిని అమ్ముతూ వాటిని సరఫరా చేస్తూ గంజాయిని విస్తరింపజేస్తున్న ముఠాను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. గంజాయి మార్కెట్ విలువ 18000 ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో సందడి చేసిన "క" హిరీ కిరణ్ అబ్బవరం

ప్రొద్దుటూరు, నవంబర్ 05, ప్రభాతవార్త:

"క" సినిమా హీరో కిరణ్ అబ్బవరం మంగళవారం ప్రొద్దుటూరులో సందడి చేశారు. ఆయన హీరోగా నటించిన 'క' సినిమా విజయోత్సవం సంధర్భంగా సుధ ధియోటర్‌కు వచ్చారు. అభిమానులతో కలిసి సినిమాను కాసేపు తిలకించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ఇదే ధియోటర్‌లో తాను ఊసరవెల్లి సినిమా చూశానని, ఈ ధియోటర్‌లోనే తన సినిమా 'క' సినిమా రిలీజ్ కావడం తనకు సంతోషంగా ఉందన్నారు. ప్రొద్దుటూరు అంటే దసరా పండుగ గుర్తుకు వస్తుందని తాను దసరా వేడుకల్లో పాల్గొనేవాడినని, ప్రొద్దుటూరుతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తన సినిమాను విజయవంతం చేసినందుకు ప్రేక్షకులకు, అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు సుజిత్, సందీప్, కిరణ్, అభిమానుల సంఘం అధ్యక్షుడు సురేష్, ధియోటర్ యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

ఎస్టా మినీ గురుకులం బాలికల పాఠశాల తనిఖీ

రైల్వేకోడూరు,నవంబర్ 05,ప్రభాతవార్త:

రైల్వేకోడూరు మండలంలోని అనంతరాజుపేట పంచాయతీ ఎస్సీ మినీ గురుకులం పాఠశాలను రైల్వేకోడూరు వైసిపి సీనియర్ నాయకులు పంజం సుకుమార్ రెడ్డి, జడ్పిటిసి పాలెం కోట రత్నమ్మ లో బాలికల పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు తినే భోజనాన్ని మెనూను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా చదువు ఎలా చెబుతున్నారని, కొత్తగా వచ్చిన ప్రిన్సిపాల్ విద్యార్థులను ఎలా చూసుకుంటుందో ముఖాముఖి బాలికలనే అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని పంజం సుకుమార్ రెడ్డి బాలికలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాలెం కోట చంద్ర పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మైసూరా వారి పల్లెలో పాలం పిలుస్తుంది

రైల్వేకోడూరు,'నవంబర్ 05 ,ప్రభాతవార్త:

రైల్వేకోడూరు మండలంలోని మైసూరా వారి పల్లెలో వ్యవసాయ అధికారి సుధాకర్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు ఒకే పంటను పండించకుండా అంతర్ పంటలు పై దృష్టి సారిస్తే రైతుకు మంచి ఆదాయం పొందడానికి వీలు కలుగుతుందని వ్యవసాయ అధికారి సుధాకర్ పేర్కొన్నారు.మంచి ఆదాయం పొందడానికి ఈ మార్గాన్ని ప్రతి రైతు ఎంచుకోవాలని అన్నారు. రైతులు ఛీడ పీడలను తగ్గించుకోవడానికి తప్పనిసరిగా పంట మార్పిడి చేయాలని ప్రతి పంటలో సూక్ష్మ పోషకాలు తప్పనిసరిగా అందిస్తే రైతులు మంచి దిగుబడులను పొందవచ్చు అని తెలియజేశారు.సువెన్ కంపెనీ జనరల్ మేనేజర్ కొండారెడ్డి రైతులు పామాయిల్ సాగు చేస్తే ఉచిత మొక్కలుతో పాటు నాలుగు సంవత్సరాలు ఎరువులు కొరకు రైతు బ్యాకు అకౌంట్ కి డబ్బులు జమ చేస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఉమామహేశ్వరి, నసీభుజన్ పసు సమర్ధక శాఖ,మార్కెటింగ్ సిబ్బంది గ్రామ రైతులు పాల్గొన్నారు.

100 శాతం వ్యాధి నిరోధక టీకాలు వేయాలి

టి.సుండుపల్లి05,ప్రభాత వార్త :

వ్యాధి నిరోధక టాకాలు 100 శాతం వేయాలని జిల్లా వైద్యాధికారి కొండయ్య తెలిపారు. మంగళవారం ఆయన రాయవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆక్కడ జరుగుతున్న వైద్య సేవలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 100 రోజుల్లో ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. నవంబర్ 14 వ తేదీ నుంచి అన్ని పాఠశాలలు మరియు అన్ని అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలకు అన్ని పరిక్షలు నిర్వహించి వారికి ఏమైనా వవ్యాధులున్నాయో తెలుసుకోవాలన్నారు. ముఖ్యంగా క్యాన్సర్ పరీక్షలు చేసి ఎవరైనా బాధితులు ఉంటే వైద్యం అందించేందుకు పంపించాలన్నారు. అలాగే నీటి పరీక్షలు నిర్వహించి త్రాగు నీరు శుబ్రంగా ఉందా లేదా అనే విషయాన్ని ప్రజలకు, ప్రభుత్వానికి తెలపాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శేఖర్ రెడ్డి, డాక్టర్ రుబీనా, సిబ్బంది పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు సాహతోపేత నిర్ణయం

అట్లూరు,నవంబర్ 05,ప్రభాత వార్త :

ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు సాహతోపేత నిర్ణయం అని అందువల్ల రైతుల భూములకు భరోసా కల్పించిందని నియోజకవర్గ టిడిపి సీనియర్ నేత మంచూరు సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం రైతుల భూములకు, ప్రజల ఆస్తులకు ఇబ్బంది కలిగించే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకొని రావడం జరిగిందన్నారు. అయితే ఈ జీఓను గోప్యంగా వైసిపి ప్రభుత్వం ఉంచి పెట్టడం జరిగిందన్నారు. అలాగే తాము అధికారంలోనికి వస్తే ఈ యాక్ట్ రద్దు చేస్తామని ఎన్నికల ముందు ప్రచారంలో హామీ ఇవ్వడం జరిగింది. ఇచ్చిన మాటకు కట్టుబడి ముఖ్యమంత్రి నారి చంద్రబాబు నాయుడు అధికారంలోనికి రాగానే రైతులకు, ప్రజలకు ఇబ్బంది కలిగించే ఈ యాక్ట్ ను రద్దు చేస్తూ చట్టసభల్లో, క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. అందువల్ల ఇటీవల గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహించి గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూముల రీ సర్వేలో ఎవరికైనా అవకతవకలు జరిగాయని అనుమానం వస్తే గ్రామ సభల్లో అధికారుల దృష్టికి తీసుకువచ్చి వాటిని పరిష్కరించుకోవచ్చని అన్నారు. అలాగే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దీపం పథకం కింద మహిళలకు ఉచితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్ల పథకాన్ని కూడా దీపావళి సందర్భంగా ప్రవేశపెట్టి మహిలల్లో ఆనందం కలిగేలా చేశారని అన్నారు. అలాగే ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఇచ్చిన హామీలన్నింటినీ పూర్తి స్థాయిలో నెరవేరుస్తామని ప్రజలు వీటి విషయమై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన తెలిపారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు

బద్వేలు,నవంబర్ 5 (ప్రభాతవార్త):

ఈమధ్యకాలంలో కొంతమంది వామపక్షాలు ప్రభుత్వ భూములు ఆక్రమించి పేదలకు గుడిసెలు ఇస్తున్నట్లు ఆశ చూపిస్తున్న వారిని నమ్మవద్దని ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని బద్వేలు తహశీల్దారు ఉదయభాస్కర్ రాజు అన్నారు. బద్వేలు మండలం సి.కొత్తపల్లె గ్రామ పరిదిలోని సర్వే నెంబర్ 51/3 నందు 1.42 ఎకరాల విస్తీర్ణంలో సీపీఐ పార్టీకి కొంతమంది వ్యక్తులు 500 గుడిసెలు వేయించారని, ఇందులో బోరు వేసి ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా విద్యుత్ కనెక్షన్ పొందారన్నారు. ఇది పరిశీలించిన నేను కనెక్షన్‌ను విద్యుత్ శాఖ వారి ద్వారా తొలగించడం జరిగిందన్నారు. అలాగే ప్రభుత్వ భూములు ఎవరైనా ఆక్రమించినా లేక నిర్మాణాలు చేపట్టినా వారిపై కఠిన చర్యలు ఉంటాయని తెలియజేస్తున్నామన్నారు. సి.కొత్తపల్లె గ్రామ పరిధిలో ఉన్న ప్రభుత్వభూమిలో ఏ ఒక్కరూ నిర్మాణాలు చేపట్టరాదని, ఇక్కడ బోరు కూడా వేయడం జరిగిందని, వీటన్నింటిని తొలగించి స్వాధీనం చేసుకున్నామన్నారు.

ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి:ఏడి భాస్కరరావు

రైల్వేకోడూరు,నవంబర్ 05,ప్రభాతవార్త:

రైల్వేకోడూరు మండలంలోని రాఘవరాజపురం 33/11 కె వి ఆవరణము నందు బుధవారం జరగనున్న ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైల్వేకోడూరు విద్యుత్ ఏడి భాస్కరరావు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక రాజంపేట వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కు చెందిన అధికారులు,సిబ్బంది ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారని ఆయన అన్నారు.వినియోగదారుల పరిష్కారం కానీ సమస్యలను వ్రాతపూర్వకంగా ఫిర్యాదు ద్వారా తెలియపరిచి పరిష్కారం పొందాలని భస్కరరావు పేర్కొన్నారు

తిమ్మారెడ్డి గారి పల్లెలో పాలం పిలుస్తోంది కార్యక్రమం

చక్రాయపేట,నవంబర్ 05 ,ప్రభాతవార్త:

ఈ రోజు తిమ్మ రెడ్డి గారి పల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమము పులివెందుల సహయ వ్యవసాయ సంచాలకులు'రెగ్యులర్) డిఆర్.అంబవరం ప్రభాకర్ రెడ్డి గారు అధ్యక్షతన జరిగింది. రాబోవు రబీ సీజన్ లో రైతులు సాగు చేయబోయే పంట వివరములను రైతులకు సేంద్రియ వ్యవసాయం,కాలిబాటలు ఉపయోగం,రసాయన పురుగు మందుల వినియోగం తగ్గించుట వంటి విషయాలను రైతులకు అవగాహన కల్పించారు.ప్రకృతి వ్యవసాయ సిబ్బంది,రైతులకు విత్తన శుద్ది,బీజ రక్షా ఉపయోగాలను తెలిపి,వారి ముందే బీజ రక్షా తయారు చేసి చూపించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పులివెందుల ఎడిఎ ప్రభాకర్ రెడ్డి,మండల వ్యవసాయాధికారి నవంత్ బాబు,ఉద్యాన సహాయకులు శ్రీకాంత్,ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు

పొలం పిలుస్తుంది

మైదుకూరు, నవంబర్ 05,ప్రభాతవార్త:

కృషి విజ్ఞాన కేంద్రం ఒనిపెంట శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీ విద్యారాణి,డాక్టర్ ఎస్. ఫిరోజ్ హుస్సేన్ మైదుకూరు వ్యవసాయ శాఖ వారు నిర్వహించిన పొలం పిలుస్తోంది నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా శాస్త్రవేత్తలు కెవికె వారు నిర్వహించే కార్యక్రమాలను వివరించారు.జీవన ఎరువులు ప్రాముఖ్యత గురించి,విత్తన శుద్ది ఉపయోగాల గురించి.పసుపు అరటిలో వచ్చే దుంప కుళ్ళు,తెగులు నివారణ గురించి ఆకు మచ్చ తెగులు నివారణ గురించి వివరించారు.అరటిలో వచ్చే సిగటోకి యాజమాన్యం గురించి వివరించారు.టమోటా మరియు మిరప పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించడం గురించి తెలియజేశారు. విశ్వనాధపురం లో పసుపు,అరటి మరియు టమోటా పంటను పరిశీలించి తగిన సూచనలు అందించారు.జంగంపల్లిలో ద్రవ జీవామృతం యొక్క తయారీ విధానాన్ని తెలియజేసి దాని ప్రాముఖ్యత గురించి భూమి యొక్క సాంద్రత మరియు ఫర్టిలిటీ పెరగడం గురించి తెలియజేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

లక్ష సభ్యత్వాలు లక్ష్యం

రాజంపేట,నవంబర్ 05,ప్రభాత వార్త :

రాజంపేట నియోజకవర్గంలో లక్ష సభ్యత్వాలు చేయడమే తన లక్ష్యం అని రాష్ట్రంలోనే రాజంపేటను అత్యధికంగా సభ్యత్వాలు నమోదు చేసి ముందు స్థానంలో నిలబెట్టడమే తన ఆశయమని రాజంపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ సుగవాసు బాలసుబ్రమణ్యం తెలిపారు. మంగళవారం రాజంపేట ఆర్‌అండ్‌బి అథిది గృహంలో టిడిపి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజంపేట నియోజకవర్గంలోనే అన్ని మండలాల్లో అన్ని గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టి అత్యధికంగా సభ్యత్వాలు నమోదు చేసేందుకు టిడిపి నాయకులు, కార్యకర్తలు తమ వంతు కృషి చేయాలని ఈ కార్యక్రమాన్ని వేగవంత చేసి సభ్యత్వ నమోదును రాష్ట్రంలోనే రాజంపేటలో నిలబెట్టేందుకు కలసి కట్టుగా కంకణం కట్టుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో గీతాంజలీ విధ్యాసంస్థల అధినేత టిడిపి నాయకులు ఎస్‌వి రమణ, ప్రముఖ న్యాయవాధి బార్ అసోషియేషన్ మాజీ అధ్యక్షులు, మాజీ ఏజీపీ, లక్ష్మీ నారాయణ, డాక్టర్ సుధాకర్, మండల పార్టీ అధ్యక్షులు గన్నే సుబ్బనరసయ్య నాయుడు, నాగినేని నాగేశ్వర్ నాయుడు, సంజీవరావు, ఎం ఎంల్ నారాయణ, గుగ్గిళ్ల చంద్రమౌళి, మనుపూరు వెంకటేశ్వర్లు, మలిసెట్టి వెంకట్రమణ, నామా హరితో పాటు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రస్తుతం సభ్యత్వ నమోదు కార్యక్రమమంలో లక్ష సభ్యత్వాలు చేసి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచేందుకు తన లక్ష్యం ఆశయం అని సుగవాసి చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆయన అందరిలో కలసి కట్టుగా సభ్యత్వాలు చేసి తమ సత్తాను చాటుకుంటామని కార్యకర్తలు, నాయకులు ఈ సందర్భంగా మంచి సంకల్పంతో ప్రతిజ్ఞ చేశారు.

అధికారులు సమస్యలు పరిష్కరించాలి

పీలేరు, నవంబరు 05 ప్రభాతవార్తః

పీలేరు నియోజకర్గ పరిధిలో ఉన్న ఆరుమండలాల మండల స్థాయి అధికారులతో పాటు గ్రామాధికారుల సైతం కూటమి ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి న్యాయం చేసేవిధంగా కషిచేయాలని ఆయన సూచించారు. అదేవిధంగా సమస్యలపై ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రతి ఒక్కరికి సానుకూలంగా పనులు చేసిపెట్టాలని ఆయన కోరారు. మంగళవారం నియోజకవర్గ పరిధిలోని పీలేరు, కలికిరి మండలాల్లో నిర్వహించిన అధికారుల సంయుక్త సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల మౌలిక వసతులైన తాగునీరు, మురుగునీటి కాలువ పరిశుభ్రం విషయంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డి మంగళవారం అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు సంయుక్త సమావేశం నిర్వహించారు. అధికారి ఉన్నది ప్రజా సమస్యలు పరిష్కరించడానికే అని అందులో ఉన్న నిధులు తొలుత తాగునీటి సమస్య పరిష్కరించాలని తాగునీటి శుద్ద జల కేంద్రం నిర్వహణ కూడా పంచాయతీ నిధులతోనే చూడాలని సూచించారు. నిధుల సమస్య ఉన్నట్లయితే తమ దష్టికి తీసుకురావాలని, ఇప్పటికే కొన్ని గ్రామాలలో సిమెంటు రోడ్లు మంజూరు చేయించామని వాటిని కూడా సత్వరం పూర్తిచేయాలన్నారు. సమావేశంలో తహశీల్దారు భీమేశ్వరరావు, ఎంపీడీఓ శివశంకర్, పీఆర్‌డీఈ మధుసూదన్, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి రాజమ్మ, తెదేపా నాయకులు కోటపల్లె బాబురెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి అమర్నాధరెడ్డి, పురం రామమూర్తి, సురేంద్ర, వెంకటరమణారెడ్డి ఆతికాషఫీ, రాజగోపాల్‌నాయుడు, లడ్డూజాఫర్, రెడ్డిబాషా, లక్ష్మీకర్, రమణారెడ్డి, స్పోర్ట్సు మల్లి, రిజాయ్, తదితర తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూనెవిత్తుల కర్మాగారం భూముల పరిశీలన

పీలేరు, నవంబరు 05 ప్రభాతవార్తః

పీలేరు మండలం గూడరేవుపల్లె పంచాయతీ పరిధిలో ఉన్న నూనెవిత్తుల కర్మాగారం సంబంధించిన భూములను రాయచోటి ఆర్డీవో శ్రీనివాసులు మంగళవారం పరిశీలించారు. నూనెవిత్తుల కర్మాగారం భూములను గుర్తించి బౌండరీ, సరిహద్దులు గుర్తించాలని సంబంధిత సంస్థ జిల్లా కలెక్టర్‌ను కోరింది. ఈ మేరకు పరిశీలనకు వచ్చామని ఆర్డీవో తెలిపారు. ఈసందర్భంగా నూనెవిత్తుల కర్మాగారం భూములలో చేపట్టిన నిర్మాణాలు, ప్రహరీ తదితరలను పరిశీలించారు. భూములకు కొలతలు వేసి సరిహద్దులు గుర్తించడానికి చర్యలు తీసుకుంటామని ఆర్డీవో తెలిపారు.

గురుకుల పాఠశాల తనిఖీః

ఈసందర్భంగా నూనె విత్తుల కర్మాగారంలోని సిబ్బంది నివాస సముదాయంలో నిర్వహిస్తున్న జనరల్ బాలికల గురుకుల పాఠశాలను ఆర్డీవో తనిఖీచేశారు. ఒకే గదిలో తరగతి , బస, వసతి మూడు కూడు గదిలోనే విద్యార్థులు మగ్గుతుండటం ఆర్డీవో గ్రహించారు. ఈసందర్భంగా విద్యార్థినిలు నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల భవనం సౌకర్యంగా లేదని తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.మెనూ ప్రకారం భోజనాలు పెడుతున్నారా లేదా అని విద్యార్థులును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అభ్యర్థన సామర్థ్యాలపై ఆయన ఆరా తీశారు. పాఠశాల భవన నిర్మాణానికి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో వివరించారు. ఆర్డీవో వెంట తహశీల్దారు భీమేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. ఎస్‌కేఆర్ ఆసుపత్రిలో మతిచెందిన మహిళపై విచారణలో జాప్యం వద్దని ఆర్డీవోను కోరిన సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి టీఎల్ వెంకటేష్ డిమాండు చేశారు. పట్టణంలోని ప్రస్తుతం ఉన్న డాక్టర్లు పేరుమోసినవారు, విశ్రాంత డాక్టర్లు వీరందరిపేర్లు ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్లపై విచారణ జరిపించాల్సిన అవసరం ఉందని వారు అన్నారు. విధులను నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండు చేశారు.

జిల్లా విజిలెన్సు మానిటరింగ్ కమిటీ సభ్యులుగా బోదేషావలి

పీలేరు, నవంబరు 05 ప్రభాతవార్తః

జిల్లా విజిలెన్సు మానిటరింగ్ కమిటీ సభ్యులుగా బోదేషావలిని నియమిస్తూ జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఉత్తర్వులు జారీ చేశారు.బోదేషావలి ఆర్‌సాట్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధిగా ఈకమిటీలో చోటు కల్పించారు. ఉన్నత విద్యావంతుడైన బోదేషావలి ప్రకతి వ్యవసాయంపైన రైతులకు విశేష సేవలు అందిస్తున్నారు. వ్యవసాయరంగానికి ఈయన చేసిన సేవలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యునిగా అప్పటి కలెక్టర్ హరినారాయణగారు కల్పించారు. జిల్లాప్రజలకు ప్రభుత్వ పరంగా రావాల్సి ప్రోత్సాహకాలను అందేవిధంగా కషిచేశారు. జిల్లాల విభజన తరువాత అన్నమయ్య జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యునిగా కొనసాగుతూ తమ సేవలను కొనసాగించారు. ఈక్రమంలో జిల్లా విజిలెన్సు మానిటరింగ్ కమిటీ సభ్యునిగా బోదేషావలి నియమితులైనందుకు పలువురు హర్షం వ్యక్తం చేశారు.

మాదక ద్రవ్యాల వ్యతిరేక పోస్టర్లు విడుదల

పీలేరు, నవంబరు05 ప్రభాతవార్తః

మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రచార కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో రూపొందించిన గోడపత్రికలను సర్కిల్ ఇన్స్పెక్టర్ యుగంధర్ ప్రారంభించినట్లు ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షులు అమతతేజ తెలిపారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి సీఐ మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలకు అలవాటుపడి వారి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండి సమాజంలో మంచి పౌరులుగా వారి భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని చెప్పారు. యువత గంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాఆలకు దూరంగా ఉండాలని అదేవిధంగా గంజాయి డ్రగ్స్ వంటి ఇతర అసాంఘిక కార్యకలాపాలు ఏవైనా ప్రజల దష్టికి వస్తే పోలీసులకు సమాచారం అందించాలని తెలియజేశారు. ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు అమతతేజ మాట్లాడుతూ పరిసర ప్రాంతాల్లో గంజాయికి యువత అలవాటు పడ్డారని అలాంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఎన్ఎస్‌యుఐ అమతతేజ మాట్లాడుతూ పీలేరు పరిసర ప్రాంతాల్లో గంజాయికి యువత అలవాటు పడ్డారని అలాంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు. ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలోమాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రచార కార్యక్రమాన్ని ప్రతి విద్యార్థి సంఘం ద్వారా నిర్వహించి విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పలితాలను వివరించాలని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ రాజంపేట పార్లమెంటు అధ్యక్షులు సాయిసంపత్‌కుమార్, జిల్లా నాయకులు ఇమ్రాన్, మోహన్, అఖిల్, శివ, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ స్వచ్ఛంద సేవా సమితి ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నిక

పీలేరు, నవంబరు 05 ప్రభాతవార్తః

స్థానిక అమ్మస్వచ్ఛంద సేవా సమితి ఆద్వర్యంలో మంగళవారం పీలేరు నియోజకవర్గ నూతన కమిటీని అమ్మ ఆశ్వా వ్యవస్థాపక చీనేపల్లె నాగేంద్ర ఏర్పాటు చేశారు. ప్రసెడెంట్ రెడ్డిశేఖర్, వైస్ ప్రెసిడెంట్ నరసింహ, సెక్రటరీ శ్రీనివాసులు జాయింట్ సెక్రటరీ పవన్ కుమార్, కోశాధికారి తరుణ్‌కుమార్, కమిటీ సభ్యులు మధుసూదన్ నాయక్, బాలాజీ నాయక్, విష్ణువర్ధన్ విశాల్, నరసింహ, రాజాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా అమ్మ ఆశ్వా వ్యవస్థాపక అధ్యక్షులు మాట్లాడుతూ ఇతరులకు సేవ చేయడం సామాజిక సేవ కాదు, మన కనీస బాధ్యత అని ఆయన కొనియాడారు.

జిల్లేళ్లమంద పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

కేవి.పల్లె, నవంబరు 05 ప్రభాతవార్తః

కేవి.పల్లె మండలం జిల్లేలమంద ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను అన్నమయ్య జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ కొండయ్య తనిఖీచేశారు. ఈసందర్భంగా పీహెచ్‌సీ ఓ ఆరోగ్యకేంద్రంలో సి

యాంటి ర్యాగింగ్‌కు పాల్పడితే కఠినచర్యలు - సిఐ రమేష్

సమావేశంలో మాట్లాడుతున్న సిఐ

కురబలకోట, నవంబర్ 5 ప్రభాతవార్త :

కళాశాలల ఆవరణాల్లో యాంటి ర్యాగింగ్ పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మదనపల్లె రూరల్ సిఐ రమేష్ అన్నారు. మంగళవారం మిట్స్ కళాశాలో ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవాగాహన సదస్సు నిర్వహించారు. ర్యాగింగ్ వల్ల కలిగే తీవ్ర ప్రభావాల గురించి విద్యార్థులకు చైతన్యపరచాలని ఆయన కోరారు. విద్యావ్యవస్థలో ర్యాగింగ్ అనేది కలవరపెట్టే వాస్తవం అన్నారు. ఈ ర్యాగింగ్ వల్ల ప్రతి స్కూల్‌లో ఎంతో మంది విద్యార్థులు భలైనట్లు తెలిపారు. ర్యాగింగ్ నిరోదానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తీసుకువచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామనాథన్, తులసీరామ్‌నాయుడు, చంద్రమోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటింటా నైపుణ్యగణన యువత భవితకు భరోసా

ప్రసంగిస్తున్న దృశ్యం

నిమ్మనపల్లె, నవంబర్ 5 ప్రభాతవార్త :

ఏపి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇంటింటా కార్యక్రమాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి పరమేశ్వర్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. యువతలో దాగిఉన్న నైపుణ్యాన్ని వెలికితీసి దేశ భవితకు పునాదులు వేయడానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకొన్న వినూత్న కార్యక్రమమని తెలిపారు. మండలంలోని 12 గ్రామ సచివాలయ ఉద్యోగస్తులు ఈ శిక్షణా శిబిరంలో పాల్గొన్నారు. జిఎస్‌డబ్ల్యుఎస్ ఏఓ లక్ష్మీపతి ముఖ్య అతిథిగా హాజరుకాగా ఎంపిడిఓ పరమేశ్వర్‌రెడ్డి, పరిపాలన అధికారి రమేష్, ఈఓఆర్‌డి చలపతిరావు, గ్రామ కార్యదర్శులు వెంకటరమణారెడ్డి, నాగభూషణం, గౌతమి, శ్రీనాథ్, మారెప్ప, గాయత్రి, లోకేశ్వరి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టిప్పర్‌చే ఇసుక తరలిస్తున్న డ్రైవర్, యజమాని అరెస్టు

నిమ్మనపల్లె, నవంబర్ 5 ప్రభాతవార్త :

మండలం నుంచి టిప్పర్‌చే ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తీసుకెలుతున్న ట్రిప్పర్ డ్రైవర్ శంకర, యజమాని అశోక్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిప్పేస్వామి మంగళవారం తెలిపారు. డ్రైవర్ బైరెడ్డిపల్లె వాసి, యజమాని వివరాలు తెలియాల్సి ఉంది.

మహిళల భద్రతపై అవగాహన సదస్సు

వేంపల్లె, నవంబరు 5, ప్రభాతవార్త :

వేంపల్లెలోని వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో మహిళల భద్రతపై అవగాహన సదస్సును ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు క్రమశిక్షణ అలవరచుకోవాలని, పలు ఉదాహరణలతో వివరించారు. ఉమెన్ ఎంపవర్‌మెంట్ కోఆర్డినేటరు డాక్టర్ నాగలక్ష్మిదేవి మాట్లాడుతూ మహిళలు తమ వ్యక్తిత్వం గురించి మాట్లాడుతూ ఉన్నతమైన మహిళలను ఆదర్శంగా తీసుకుని నేటి యువ మహిళలు ముందుకు సాగాలని వివరించారు. వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో చుట్టూ ఉన్నటువంటి పరిస్థితులను అవగాహన చేసుకుని జాగ్రత్తగా నడుచుకోవాలని తెలిపారు. తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మల్లేశ్వరమ్మ, కేశమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి

వేంపల్లె, నవంబరు 5, ప్రభాతవార్త :

వేంపల్లె పట్టణంలో రోజురోజుకూ ట్రాఫిక్ సమస్య అధికమవుతోందని, అందువల్ల పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వేంపల్లె సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. వేంపల్లెలోని కడపరోడ్డులో ఉన్న వృషభాచలేశ్వరస్వామి దేవాలయం కాంప్లెక్స్ ముందు భాగంలో మట్టిని డోజర్ సాయంతో శుభ్రం చేయించారు. వాహనదారులు బైకులు పార్కింగ్ చేసేందుకు స్థలాన్ని ఏర్పాటు చేశారు. వాహనదారులు బైకులు ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయకుండా, ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన వేంపల్లె తెదేపా నాయకులు

వేంపల్లె, నవంబరు 5, ప్రభాతవార్త :

బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితను మంగళవారం వేంపల్లె మండల తెదేపా నాయకులు కలిశారు. స్థానిక మధురెడ్డి ఫంక్షన్ హాల్ వద్ద తెదేపా వేంపల్లె పట్టణ అధ్యక్షుడు ఆర్.వి.రమేష్, వేంపల్లె మండల మాజీ కన్వీనరు మల్లంగి భాస్కర్‌రెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి జయరాంరెడ్డి, వేంపల్లె మండల నాయకులు జైచంద్ర, గోపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ఎద్దుల శేషారెడ్డి, అఆల్లబకాష్, పాములూరు చంటి, రెడ్డికిషోర్, యుగంధర్, తదితరులు సుమారు 200మందికి పైగా మంత్రి సవితను కలిసి సమస్యలపై చర్చించారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానని మంత్రి హామీఇచ్చినట్లు తెదేపా నాయకులు తెలిపారు.

– పాపఘ్నినదిలో యథేచ్ఛ ఇసుక తరలింపును ఆపాలి : వేంపల్లెలోని పాపాఘ్ని నదిలో ఇసుక యథేచ్ఛగా రవాణా చేస్తున్నారని, ఈ ప్రాంతంలో సుమారు 20గ్రామాలకు తాగునీరు అందించే బోర్లు, వ్యవసాయ భూములు ఉన్నాయని పలువురు రైతులు, ప్రజలు మంత్రి సవితకు వినతిపత్రం సమర్పించారు. అంతకుముందు టీడీపీ నాయకులు, కార్యకర్తలు వేంపల్లెలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద మంత్రికి ఘన స్వాగతం పలికారు.

పీపీఈ కిట్స్ ధరించి విధుల్లో పాల్గొనాలి

పులివెందుల, నవంబరు 5, ప్రభాతవార్త :

పట్టణంలో సెప్టిక్ ట్యాంకులను శుభ్ర పరిచే కార్యక్రమంలో పాల్గొనే ప్రతి కార్మికుడు పీపీఈ కిట్స్ ధరించి విధుల్లో పాల్గొనాలని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్, కమీషనరు రాముడులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు దినేషనల్ యాక్షన్ ఫర్ మేకనైజ్డ్ శానిటేషన్ ఎకోసిస్టమ్ (నమస్తే) కార్యక్రమంలో భాగంగా సఫాయి కర్మచారి కార్మికులకు వీటిని అందించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కిషోర్, ఖాదర్‌బాషా, కోఆప్షన్ సభ్యులు చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ నిరుద్యోగులకు సువర్ణ అవకాశం

తంబళ్లపల్లె, నవంబరు 5, ప్రభాతవార్త:

నియోజకవర్గ పరిధిలోని ఐటీఐ నిరుద్యోగులకు సువర్ణ అవకాశం. ఐటీఐ పాసై 28 ఏళ్ల వయసు పురుష అభ్యర్థులు టెక్నీషియన్, ఆపరేటర్లకు రూ.16 వేలు జీతం ఇవ్వబడుతుంది. ఆసక్తి గల నిరుద్యోగ యువకులు తిరుపతి జిల్లా సూళ్లూరుపేట ఇందూస్ కాఫీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఈనెల 8వ తేదీ వెంటనే మీ బయోడేటా పంపాలని ఇతర వివరాలకు 7989057588 నంబరును సంప్రదించాలని కంపెనీ ప్రతినిధులు తెలిపారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ గ్రామసభలు

పులివెందుల, నవంబరు 5, ప్రభాతవార్త :

భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తోందని, రైతులు వీటిని వినియోగించుకోవాలని తహసీల్దారు రామచంద్రుడు అన్నారు. మంగళవారం మండలంలోని సైదాపురం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సర్పంచి ఓబుళరెడ్డి అధ్యక్షతన రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ భూ సర్వేలో జరిగిన లోపాలు ఉన్నట్లైతే రైతులు దరఖాస్తులు చేసుకోవాలని, వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. ఈ గ్రామసభలో వివిధ సమస్యలపై రైతుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటి తహసీల్దారు రాజేశ్వరి, మండల సర్వేయరు రాఘవేంద్ర, ఆర్ఐ యేసోబే, వీఆర్వో పుల్లయ్య, రెవెన్యూ అధికారులు, వీఆర్వోలు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ వాహనాల వినూత్న పరిశోధనలో పీహెచ్‌డీ స్వీకరించిన శాస్త్రవేత్త బచ్చు వీణావాణి

కడప కార్పొరేషన్, నవంబరు 5, ప్రభాతవార్త:

కడప జిల్లా వాసి బచ్చు వీణా వాని నీట్ కర్నాటకలో పీహెచ్‌డీ పూర్తి చేసి ప్రఖ్యాతి గాంచారు. ఎలక్ట్రిక్ వాహనాల మార్గదర్శనం, బ్యాటరీ మార్పిడి వ్యూహాలకు సంబంధించిన సాంకేతికతను మెరుగుపరచడానికి హూరిస్టిక్ ఆప్టిమైజేషన్ పరిశోధనలో శ్రద్ధగా పని చేసిన వీణావాణి విజయవంతంగా తన సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించినట్లు వీణావాణి పేర్కొన్నారు. నిట్ కర్ణాటక అధికారులతో ఆమెకు పీహెచ్‌డీ డా.ఆఫ్ ఫిలాసఫీ అవార్డు ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగంలో ప్రదానం చేసినట్లు ఆమె తెలిపారు. నిట్ కర్ణాటక సురత్కల్‌లోని ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగంలో సమర్పించారు. నా పరిశోధనకు నిట్ కర్ణాటకలోని ప్రొఫెసర్ డా.ధారావత్ కిషన్, సహ పర్యవేక్షకుడు డా.ఎం.వసీం అహ్మద్‌లు మార్గదర్శనం చేసినట్లు చెప్పారు.

కడప డీఎస్పీ వెంకటేశ్వర్లుకు సన్మానం

కడప కార్పొరేషన్, నవంబరు 5, ప్రభాతవార్త:

కడప డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్లును ఏపీ ఎన్జీవో కడప జిల్లా నాయకులు ఘనంగా సన్మానించారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కడప డీఎస్పీని సన్మానించిన వారిలో ఏపీఎన్‌జీజీవోకు కడప జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి డి.రవికుమార్, జిల్లా సహాధ్యక్షులు టి.తిమ్మారెడ్డి, ఉపాధ్యక్షులు టి.శ్రీనివాసులు, జిల్లా సంయుక్త కార్యదర్శి ఎన్.రాజశేఖర్, కడప సిటీ అధ్యక్షులు చిన్నయ్య, కార్యదర్శి సైలేశ్వర్‌రెడ్డి, సిటీ ఉపాధ్యక్షులు పద్మనాభం ఉన్నారు.

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిని కలిసిన టీడీపీ సీనియర్ నేత లక్ష్మీరెడ్డి కుటుంబ సభ్యులు

కడప కార్పొరేషన్, నవంబరు 5, ప్రభాతవార్త:

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి హోదాలో మొదటి సారిగా కడపకు విచ్చేసిన బీసీ సంక్షేమం, చేనేత జౌళీ, ఈడబ్ల్యూఎస్ శాఖామాత్యులు సంజీవరెడ్డి సవితను తెదేపా సీనియర్ నేత ఆలంఖాన్‌పల్లె లక్ష్మీరెడ్డి కుటుంబ సభ్యులు కలిసి గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కడప జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత మంగళవారం కడప నగరంలోని బిల్టప్ వద్ద పుత్తా ఎస్టేట్‌కు విచ్చేశారు. ఈ సందర్భంగా లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో తెదేపా బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరి కృషి అవసరమన్నారు. రాష్ట్రం కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం, రాష్ట్ర ప్రజల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు. ఆయనతో ప్రతి ఒక్కరూ కలిసి అడుగు ముందుకేసి రాష్ట్రాభివృద్ధిలో పాలు పంచుకోవాలని పిలుపునిచ్చారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

తంబళ్లపల్లె, నవంబరు 5, ప్రభాతవార్త:

సచివాలయ ఉద్యోగులు మారుమూల గ్రామాల్లోని ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఎంపీడీవో ఉపేందర్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఆయన మండలంలోని కన్నెమడుగు, ఎద్దులవారిపల్లి సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. సచివాలయ హాజరు రిజిష్టరు తనిఖీతో పాటు సచివాలయ ఉద్యోగుల పనితీరుపై ఆరా తీశారు. సచివాలయ ఉద్యోగులు తమ పరిధిలోని గ్రామాల్లో ముమ్మరంగా పర్యటించి పారిశుద్ధ్యం, వైద్యం, తాగునీరు, వీధిలైట్లు, మౌలిక సదుపాయాల ఏర్పాటుపై అప్రమత్తంగా ఉండి సమస్యలుంటే ఎప్పటికప్పుడు పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అదే విధంగా ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పథకాలు లబ్ధిదారులకు అందించడానికి స్థానిక ప్రజా ప్రతినిధలు, అధికార పార్టీ నాయకుల సలహాలు, సూచనలతో కృషి చేయాలన్నారు. ఆయన వెంట ఈఓఆర్‌డీ దిలీప్‌కుమార్ నాయక్, ఏవో థామస్ రాజా, కార్యదర్శులు ఉద్యోగులు ఉన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ట్రాక్టర్ - మహిళ మృతి

చిన్నమండెం,నవంబర్ 05, ప్రభాతవార్త:

మండలంలోని చిన్నమండెం నుండి పెద్దమండెం వెళ్లు రహదారిలో చాంద్‌బాష మామిడి తోట వద్ద మంగళవారం గల ట్రాక్టర్ టివిఎస్ ఎక్స్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ సంఘటనలో పడమటికోన గ్రామం నడిగడ్డపల్లెకు చెందిన మర్రిపాటి రామాంజులమ్మ టైర్ కింద పడి అక్కడిక్కడే మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. నడిగడ్డపల్లెకు చెందిన నాగరాజు తన భార్య రామాంజులమ్మతో కలిసి చిన్నమండెం వచ్చి తిరిగి స్వంత ఊరికి వెళ్తుండగా వెనుకవైపు నుండి ట్రాక్టర్ ఢీకొంది. ఈ సంఘటనలో నాగరాజు ట్రాక్టర్‌కు దూరంగా పడగా, రామాంజులమ్మ ట్రాక్టర్ టైర్ కింద పడి మృతి చెందింది. ఈ మేరకు మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చిట్వేలి ప్రాజెక్టులో ఘనంగా ఈసీసీఈ సంబరాలు

చిట్వేలి, నవంబరు 5, ప్రభాతవార్త:

6 సంవత్సరాలలోపు పిల్లల్లో మానసిక, శారీరక ఎదుగుదలను పెంపొందించే బాల్య సంరక్షణ విద్యా కార్యక్రమ సంబరాలను మంగళవారం చిట్వేలి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని 144 అంగన్‌వాడీ సెంటర్లలో ఘనంగా నిర్వహించారు. కేకే వడ్డీపల్లెలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీడీపీవో రాజేశ్వరి మాట్లాడుతూ ప్రతి నెల 5వ తేదీ నిర్వహించే ఈసీసీఈడే వల్ల పిల్లల సమగ్రాభివృద్ధిని అంచనా వేయడంతో పాటు వారి తల్లిదండ్రులకు పిల్లల శారీరక, మానసిక స్థితిని తెలియజేయడం జరుగుతుందన్నారు. మాతా శిశు సంరక్షనే ధ్యేయంగా పనిచేస్తున్న ఐసీడీఎస్ పనిలో పూర్వ ప్రాథమిక విద్య అనేది అత్యంత కీలకమన్నారు. 3-6 సంవత్సరాల లోపు పిల్లల మెదడు వేగంగా అభివృద్ధి చెందే దశ కాబట్టి ఆటపాటల ద్వారా ఆ పిల్లల మెదడు పరిపక్వతకు అంగన్‌వాడీ సిబ్బంది బలమైన పునాదులు వేయాలన్నారు. శిశువుకు మొదటి గురువు తల్లే అని, ప్రతి తల్లి బిడ్డల ఎదుగుదలలో కీలకం కావాలన్నారు. వారితో ఎక్కువ సమయం వెచ్చించి విద్యపై ఇష్టాన్ని పెంచాలన్నారు. భావి భారత పిల్లల్ని తయారు చేసే మొదటి పాఠశాల అంగన్‌వాడీనని, అంగన్‌వాడీ కార్యకర్తలు తమ విధులను ఒక సామాజిక బాధ్యతగా భావించి పిల్లల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చిట్వేలి ప్రాజెక్టు గ్రేడ్-1 సూపర్‌వైజర్లు వసుంధరమ్మ, విజయకుమారి, విశాలాక్షి, సురేఖరాణి, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, తల్లిదండ్రులు, పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన విద్యుత్తు అందించాలి

కలికిరి, నవంబరు 5, ప్రభాతవార్త:

రైతులకు, ప్రజలకు మెరుగైన విద్యుత్తు సౌకర్యం కల్పించాలని పీలేరు నియోజకవర్గం ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గుట్టపాలెంలో నిర్మించిన నూతన విద్యుత్తు సబ్‌స్టేషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లో ఓల్టేజ్ సమస్యను పరిష్కరించే దిశగా గుట్టపాలెం పంచాయతీలో నూతన సబ్‌స్టేషన్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా ట్రాన్స్ ఎస్ఈ ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, ట్రాన్స్‌కో డీఈలు శివయ్య, రెడ్డికుమార్, ఏఈలు ముజీబర్ రెహమాన్, వసంతరెడ్డి, తెదేపా నాయకులు కంభం వెంకటరమణారెడ్డి, రాజంపేట పార్లమెంటు జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు వాసనూరి చంద్రశేఖర్, నాయకులు విజయ్ కుమార్‌రెడ్డి, తెదేపా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎగబడ్డ ఎక్స్‌పోర్టర్లు, బయ్యర్లు, మిల్లర్లు

ఓబులవారిపల్లె, నవంబరు 5, ప్రభాతవార్త:

ఏపీఎండీసీ బెరైటీస్ కోసం ఎగుమతి చేసే వ్యాపారదారులు మిల్లర్లు, బయ్యర్లు మంగళవారం ఎగబడ్డారు. ఏపీఎండీసీ సంస్థలో గ్రేడుల్లో గందరగోళం ఏమిటి తిరుమలేశా అనే వార్తకు స్పందించిన కొందరు ఆ ఒరెండు కంపెనీలకే ఆది, సోమవారాలు అధికంగా బి గ్రేడు గ్రావిటీ ఉన్న ముగ్గురాయిని సి గ్రేడు కింద సరఫరా చేయడం వేల టన్నులు పంపిణీ చేయడంతో సంస్థ ఖజానాకు గండిపడినట్లు తెలుస్తోంది. మేమేమీ తక్కువా అంటూ మరికొంత మంది కూటమి నాయకులు వ్యాపారం సాగించాలని సంస్థ అధికారులపై ఒత్తిడి తేవడం జరిగింది. దాదాపు వందల సంఖ్యలో లారీలను మిషనర్లను ఉంచి ఎగుమతి పెంచారు. పోటాపోటీగా వ్యాపారం సాగించారు. తక్కువ రేటుతో కొనుగోలు చేశారు. ఎదీంతో సంస్థ ఆదాయానికి కోట్లాది రూపాయలు నష్టం వాటిల్లినట్లు గుసగుసలు వినబడుతున్నాయి. ఏది ఏమైనా ఈ నష్టాన్ని నివారించడంలో సంస్థ యాజమాన్యం యంత్రాంగం వైఫల్యం చెందినట్లు ఆరోపణలు విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో ఇలాగే చాలా సార్లు గ్రేడుల్లో గందరగోళం జరిగినప్పటికీ అవి పెద్దగా బయటికి పోకుండా సంబంధిత అధికారులు గోప్యంగా ఉంచినట్లు సమాచారం. ఆదివారం ఇది మోతాదుకు మించి జరిగిందని బహిరంగంగా అందరికి తెలిసిపోయింది. మిగతా వ్యాపారదారులు తమకు వ్యాపారం కావాలని డిమాండ్ చేశారు. ఈ పరంపరలో మంగళవారం భారీగా వ్యాపార లావాదేవీలు ముగ్గురాయి సరఫరా జరిగింది. సంస్థ ఆదాయినికి గండిపడడంతో కూటమి నాయకుల జోక్యంతో అందరికీ ముగ్గురాయి సరఫరా చేయాలనే ఉద్దేశంతో కొత్త క్యాట్ నుంచి ముగ్గురాయిని డీవోలు ప్రకారం సరఫరా చేశారని తెలుస్తోంది. మంగంపేట ఏపీఎండీసీ సంస్థలో ముగ్గురాయి ఖనిజం సి గ్రేడు బదులు బి గ్రేడు గావిటీ ఉండడంతో కొత్త లాట్ నుంచి దాదాపు ఆదివారం అయినప్పటికీ సోమవారం ఆమ్యామ్యాలతో నియమ నిబంధనలను పాటిస్తున్నామంటూ జోరుగా సరఫరాకు సహకరించారు అనే పలువురు ఆరోపిస్తున్నారు. వార్తకు స్పందించి కూటమి నాయకులు చలపతి రామ్మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, గునిపాటి రాయుడు, సాయి వికాస్‌రెడ్డిలు కలుగజేసుకొని ముగ్గురాయి అక్రమ రవాణా జరుగుతుందనడానికి ప్రశ్నలు రేకెత్తిస్తున్నాయి. ఏపీఎండీసీ కార్యాలయంలో సీపీఓ సుదర్శన్‌రెడ్డి మరియు అధికారులతో సమావేశమై గ్రావిటీ ఉండడంతో అందరూ కలిసి మాకంటే మాకు పంపిణీ చేయాలంటూ ముగ్గురాయిని సమానంగా మార్చాలని కోరడంతో తిలాసారం తలా పిడికెడు అన్న చందంగా ఎగబడి ఎగబడి అన్ని ఎపార్టీ నాయకులు వారి వారి డీవోలతో నూతనంగా ఏర్పాటు చేసిన లార్డ్‌ను ముగ్గురాయిని సరఫరా చేసి సొమ్ము చేసుకున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా వందల సంఖ్యలో లారీలు ముగ్గురాయిని సరఫరా చేసి కార్యాలయం ఎదుట నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టి కొందరికే అధికారులు సహకరిస్తున్నారని ఆ ఎక్స్‌పోర్ట్ కంపెనీలపైన మీకు ఎందుకంటే ప్రేమని ప్రశ్నించారు. గతంలో వేల టన్నులు ఎక్స్‌పోర్ట్ చేసిన కంపెనీలకు రాత్రులకు రాత్రి వేల టన్నులు సరఫరా చేశారని కూటమి నాయకులు ప్రశ్నించారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు ఏకపక్షంగా వ్యవహరించకుండా బయ్యర్లను మిల్లర్లను అందరిని ఒకేలా చూసుకోవాలని నాయకులు అధికారులను కోరారు. అందులో యూనియన్ నాయకుడు ప్రశ్నించగా ఆయనపైన సీపీవో ఆగ్రహం వ్యక్తం చేసినట్లు కూడా తెలుస్తోంది. ఏది ఏమైనా ఏపీఎండీసీలో కనీసం సరఫరాలో అందరికీ సమన్యాయం చేయాలంటే సాయి వికాస్‌రెడ్డి కూడా తెలిపారు. ఈ విషయమై ముగ్గురాయి హై గ్రేడు సరఫరా చేస్తున్నారని వర్తా పత్రికలో కథనాలు రావడంతో నాయకులు స్పందించి ఈ ప్రశ్నలు వేయడంతో అధికారులు నిలదీశారని తెలుస్తోంది. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, కూటమి నాయకులు మరియు సీఐ వెంకటేశ్వర్లు, ఏపీఎండీసీ ఎస్సై శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికై రాజీలేని పోరాటం

పులివెందుల, నవంబరు 5, ప్రభాతవార్త :

ప్రజా సమస్యల పరిష్కారానికై రాజీలేని పోరాటం చేస్తామని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. పులివెందులలో మంగళవారం ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజలు ఆయనను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. నాయకులు, కార్యకర్తలు ఎంపీని కలిసి సమస్యలపై విన్నవించారు.

వేలం ద్వారా రూ.5లక్షల47వేలు ఆదాయం

రాజుపాలెం, నవంబరు 05, ప్రభాతవార్త.

మండల పరిధిలోని వెల్లాల దేవస్థానంనకు సంబందించిన శ్రీచెన్నకేశవస్వామి, శ్రీసంజీవరాయస్వామి, శ్రీ భీమలింగేశ్వరస్వామి ఆలయాలకు చెందిన కళ్యాణమండపం, డెకరేషన్ సప్లయర్స్, బియ్యం, బేడలను మంగళవారం ఇఓ నరసయ్య, పర్యవేక్షణాధికారి కిరణ్‌కుమార్‌రెడ్డిలు వేలంపాట నిర్వహించగా దేవస్థానంనకు రూ 5లక్షల 47వేలరూపాయలు ఆదాయం వచ్చినది. ఈ వేలంలో కళ్యాణమండపం,రూ.3లక్షల38వేలు, డేకరేషన్ సప్లయర్స్, రూ.ఒక లక్ష రూపాయలు 3 సంవత్సరాలకు బాడుగ గాను మిగిలిన మొత్తం స్వామివారికి సంబంధించిన బియ్యం, బేడలకు లభించినది. దీంతో దేవస్థానంనకు రూ. 5లక్షల 47వేల రూపాయలు ఆదాయం లబించినది. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణరెడ్డి, సుబ్బిరెడ్డి, సానా వెంకటసుబ్బారెడ్డి, రామమోహన్ పాల్గొన్నారు.

డాక్టర్లు ప్రజలకు అందుబాటులో ఉండాలి

పీహెచ్‌సీ డాక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

పెనగలూరు,నవంబర్05,ప్రభాతవార్త :

వర్షాకాలం కావడంతో డాక్టర్లు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి ప్రజలకు సేవ చేయాలని సిపిఐ మండల నాయకుడు గానుగపెంట ఆదినారాయణ అన్నారు. మంగళవారం ఆయన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని డాక్టర్లకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణంలో చాలా మార్పులు రావడంతో ప్రజల్లో ఆరోగ్య సమస్యలు మొదలయ్యాయని తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలం రావడంతో ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని డాక్టర్లు సమయపాలన పాటించి మంచి వైద్యం అందించాలని తెలిపారు. మరీ ముఖ్యంగా పేద ప్రజలు ఎక్కువగా ఉన్న గ్రామాల్లో కనీసం ఆర్‌ంపి డాక్టర్‌కు కూడా చూపించుకోలేని పరిస్థితుల్లో వారు ఉన్నారని అటువంటి వారు ఆసుపత్రికి వచ్చినపుడు ప్రత్యేక శ్రద్ధ చూపించి వారిని మంచి వైద్యం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి ఈరి లక్ష్మీనారాయణ, సిపిఐ మండల కార్యవర్గ సభ్యుడు దేవూరి శంకరయ్య, మరియు బికెయంయు మండల కార్యదర్శి రేవూరి క్రిష్ణయ్య, డిహెచ్‌పియ

గ్రామసభల ద్వారా
భూ సమస్యల పరిష్కారం - తహశీల్దార్

లక్కిరెడ్డిపల్లె,నవంబర్ 05, ప్రభాతవార్త:

లక్కిరెడ్డిపల్లె మండలం మద్దిరేవుల, ఈడిగపల్లె సచివాలయం నందు మంగళవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ప్రజల నుంచి భూ సమస్యలు ఉన్న వారి నుండి అర్జీలను రెవెన్యూ సిబ్బంది స్వీకరించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న రీ సర్వేలో తప్పులను, జాయింట్ నెంబర్లను, మీ భూమి దగ్గరికి రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్‌తో కలిసి మీ సమస్యలను తీరుస్తారని ఆయన తెలియజేశారు. గ్రామ సభ బుధవారం కూడా నిర్వహిస్తామని అన్నారు. సర్పంచ్ తుమ్మల చంద్రమ్మ మాట్లాడుతూ చాలా రోజుల నుంచి పరిష్కారం కాని భూ సమస్యలను గ్రామసభల ద్వారా పరిష్కరించి ప్రజలకు, రైతులకు న్యాయం చేయాలని ఆమె తహశీల్దార్‌ను కోరారు. గ్రామంలో అందుబాటులో లేనటువంటి ప్రజలు నేడు కూడా వచ్చి అర్జీలు సమర్పించవచ్చునని ఆర్ఐ రాజేష్ తెలియజేశారు. మండల సర్వేయర్ మదన్‌మోహన్‌రెడ్డి, సెక్రెటరీ, సిరిబాబు, గ్రామ సర్వేయర్లు వేణు, ఓంప్రకాశ్‌రెడ్డి, మారుతి, వినయ్, గౌరీ, లావణ్య, సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు ముమ్మిడి బాబుల్‌రెడ్డి, కావలి ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై
విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి
హ్యూమన్ రైట్స్ రీజనల్ డైరెక్టర్ క్రిష్ణారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

ములకలచెరువు, నవంబర్ 5 ప్రభాతవార్త :

హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సైబర్ నేరాలు చిన్నారుల, మహిళలపై అత్యాచారాలపై అవగాహన సదస్సులు స్థానిక ములకలచెరువు ఏపి మోడల్ స్కూల్ నందు ప్రిన్సిపాల్ కవిత అధ్యక్షత నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఏపి తెలంగాణ విజిలెన్స్ ఛైర్మెన్ తనకంటి వేణుగోపాల్‌రెడ్డి, రీజనల్ డైరెక్టర్ క్రిష్ణారెడ్డి, ఎస్ఐ గాయత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రీజనల్ డైరెక్టర్ సమ్మిరెడ్డి క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న డిజిటల్ ప్రపంచంలో ప్రతి అడుగు ఆచితూచి జాగ్రత్తగా వేయాలి, సైబర్ నేరాలకు బలికాకుండా ఎంతో జాగ్రత్తగా మెలగవలెను, అలాగే సమాజాన్ని సురక్షితంగా ఉంచాలి,యువతీ యువకులు సైబర్ నేరాలకు, అసాంఘీక శక్తులకు, మాదకద్రవ్యాలకు, అనేక దురలవాట్లకు దూరంగా ఉండాలని, అలాగే సైబర్‌క్రైమ్స్ అజ్ఞానం వల్ల కాదు. కానీ అవగాహన లోపం వల్ల సైబర్ నేరాలకు గురిఅవటం జరుగుతోందన్నారు. విజిలెన్స్ రాష్ట్ర ఛైర్మెన్ తనకంటి వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లో అత్యవసర సమయాల్లో మాత్రమే 100కు డయల్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపి మోడల్‌స్కూల్, కళాశాల సిబ్బంది, కళాశాల ఛైర్‌పర్సన్ క్రిష్ణకుమార్‌రెడ్డి,మాజీ ఛైర్మెన్ సుధాకర్, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్‌ను ప్రారంభించిన జేసి, ఎమ్మెల్యే

రైతు బజార్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

మదనపల్లె, నవంబర్ 5 ప్రభాతవార్త :

జిల్లా సంయుక్తన కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషాలు మదనపల్లెలోని రైతు బజార్‌ను మంగళవారంప్రారంభించారు. ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ రైతుబజార్‌ను పున:ప్రారంభించడం చాలా సంతోసంగా ఉందని తెలిపారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ పట్టణంలో ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న రైతు బజార్‌ను ప్రారంభించడంతో రైతులు జీవితాల్లో వెలుగులు నిండుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్‌శాఖ త్యాగరాజ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంట మార్పిడితో మంచి ఫలితాలు-ఏవో నాగార్జున

ఖాజీపేట, నవంబర్ 05, ప్రభాతవార్త:

రైతులు సకాలంలో సరైన సూచనలు ఇస్తూ రైతుకు పూర్వ వైభవం తీసుకునేలా చర్యలు తీసుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం తలపెట్టిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం నాడు ఖాజీపేట మండలం చెన్నముక్కపల్లి, అప్పనపల్లి గ్రామాల నందు నిర్వహించడం జరిగింది. ఈ సంధర్భంగా మండల వ్యవసాయ అధికారి నాగార్జున చెన్నముక్కపల్లి, అప్పనపల్లి గ్రామాల్లోని పొలాలని పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు. తర్వాత రైతులతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ ఒక పంట తర్వాత తిరిగి అదే పంట వేయకుండా వేరే పంట సాగుచేసి పంట మార్పిడి చేయడం వల్ల జరిగే లాభాల గురించి వివరించడం జరిగింది. రబీ సీజన్ నందు పంట మార్పిడి చేయుటకు దాదాపు నలభై మంది రైతులు ముందుకు రావడం జరిగింది. అలాగే ప్రకృతి వ్యవసాయం యొక్క ఆవశ్యకతపైన రైతులకు అవగాహణ కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు మరియు వ్యవసాయ సహాయకులు, పశు సంవర్ధక సహాయకులు పాల్గొనడం జరిగింది.

ఛలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయండి
ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు అభినయ్ కుమార్

ఖాజీపేట, నవంబర్ 05, ప్రభాతవార్త:

రాష్ట్రంలో ఉన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నవంబర్ 6వ తేది తలపెట్టిన ఛలో కలెక్టరేట్ విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు అభినయ్ కుమార్ కోరారు. మీడియా సమావేశంలో అభినయ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలని ప్రస్తావిస్తూ గత ప్రభుత్వం విద్యాదీవెన, వసతి దీవెన నిధులు 3480 కోట్ల రూపాయలు బకాయిలు విద్యార్థులను విద్యకు దూరం చేసే విధంగా కనపడింది. ఏ ప్రభుత్వమైన బకాయిలు ఉంచితే నూతన ప్రభుత్వం వాటిని విడుదల చేయాలని, అదేవిధంగ జీవో నెంబర్ 77ను రద్దు చేసి ప్రైవేట్ ఎయిడెడ్ విద్యాసంస్థల్లో పీజీ చదువుతున్న విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్ కల్పించే విధంగా ఈ జీఓ నెంబర్‌ను రద్దు చేసి విద్యార్థులకు ఉన్నత విద్యను అవకాశాలు పెంచాలని, ప్రభుత్వాలు మారుతున్నా హాస్టల్ పరిస్థితి రోజు రోజుకు దిగజారుతుంది కాబట్టి వెంటనే సొంత భవణాలు ఏర్పాటుచేయాలని అదే విధంగా 6వ తేది జరిగే చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సురేంద్ర, వెంకి పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలు భూములను పరిరక్షించాలి
అక్రమార్కులపై కఠిన చర్యలు : కలెక్టర్

కురబలకోట, నవంబర్ 5 ప్రభాతవార్త :

ప్రభుత్వ స్థలాలు, భూములను పరిరక్షించే బాధ్యత అధికారులదేనని అన్నమయ్యజిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అన్నారు. ఎక్కడ కూడా భూములు, స్థలాలు అన్యాక్రాంతం కాకుండా రెవెన్యూ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. మంగళవారం కురబలకోట మండలం అంగళ్ళు గ్రామం విశ్వం ఇంజనీరింగ్ కళాశాల వద్ద ఎన్‌హెచ్-42 సమీపాన 118లో జరిగిన రస్తా పరంబోకు ఆక్రమణలను తొలగించి హెచ్చరిక బోర్డుల ప్రాంతాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈసందర్భంగా ఈనెంబర్‌లో 3.66ఎకరాలు రస్తా పరంబోకు ప్రభుత్వ భూమి ఉందని ఇందులో 28సెంట్లు ఆక్రమణకు గురైనట్లు తహశీల్దార్ తపస్విని కలెక్టర్‌కు వివరించారు. ఆక్రమణలకు గురైన స్థలంలో 12 కట్టడాలు ఉన్నాయని తెలిపారు. వాటిని తొలగించి స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు. ప్రభుత్వం భూమి చుట్టూ ట్రెంచ్ ఏర్పాటు చేసి బోర్డును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆప్రాంత మ్యాపులను పరిశీలించారు. ఎక్కడైనా ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే వెంటనే విఆర్ఓలు, విఆర్ఏలు కాపాడేందుకు చర్యలు చేపట్టాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పలు

అన్యాక్రాంతమైన భూమిలో మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

అంశాలపై తగు సూచనలు చేశారు. తహశీల్దార్ తపస్విని, ఆర్ఐ బాలసుబ్రమణ్యం, ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్, సర్వేయర్ భువనేశ్వరి, విఆర్ఓలు ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

అధికారులు ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకొని ప్రజలకు సేవ చేయాలి

కలికిరి, నవంబరు 5, ప్రభాతవార్త:

మండలంలోని గ్రామాల్లో అధికారులు ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకొని ప్రజలకు సేవలు అందించాలని పీలేరు నియోజకవర్గం ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షా సమవేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో అధికారులు, ప్రజా ప్రతినిధులు పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించాలన్నారు. పంచాయతీలలో ముఖ్యంగా మంచినీటి సమస్య, వీధిలైట్లు, డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా పంచాయతీ అధికారులు దృష్టి సారించాలన్నారు. గతంలో పనిచేసిన అధికారులు పనితీరు మారాలని అవినీతికి అవకాశం లేకుండా సమస్యలపై సచివాలయాలకు వచ్చిన ప్రజలతో గౌరవంగా మాట్లాడి వారి సమస్యలు విని వాటిని పరిష్కరించాలన్నారు. ఎక్కడైనా ఏ అధికారైనా పనులు పరిష్కరించే నిమిత్తం లంచాలకు పాల్పడితే వారిని క్షమించే ప్రసక్తి లేదన్నారు. కార్యాలయాలకు వచ్చే ప్రజల పట్ల అధికారులు మర్యాదపూర్వకంగా మాట్లాడి వారి సమస్యలు విని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ప్రజలు కట్టే పన్నులతో అధికారులు జీతాలు తీసుకుంటున్నారనే విషయాన్నిమరవరాదన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రజలకు జవాబుదారీతనంగా పనిచేసే బాధ్యత ఉందని ఎమ్మెల్యే సూచించారు. కలికిరి తన సొంత మండలమని ఎక్కడా విమర్శలకు తావివ్వ

కుండా మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పనిచేయాలన్నారు. అధిక సంఖ్యలో తహసీల్దారు కార్యాలయంపై ఫిర్యాదులు వస్తున్నాయని తహసీల్దారు కార్యాలయ సిబ్బంది, అధికారులు పనితీరు మారాలన్నారు. ఇకపై ఏ అధికారిపైనా తమకు ఫిర్యాదులందితే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే హెచ్చరించారు. గ్రామాల్లో వచ్చిన ఫిర్యాదులపై అధికారులు పర్యటించి వాటిని పరిష్కరించాలన్నారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భానుమూర్తిరావు, డిప్యూటీ తహసీల్దార్ నవీన్, తెదేపా సీనియర్ నాయకులు నల్లారి లక్ష్మీకర్‌రెడ్డి, నల్లారి చంద్రకుమార్‌రెడ్డి, రాజంపేట తెదేపా జిల్లా ఉపాధ్యక్షులు వాసనూరి చంద్రశేఖర్, కలికిరి మండలం మాజీ జడ్పీటీసీ మాలతి, కలికిరి మండలం టీడీపీ అధ్యక్షులు నిజాముద్దీన్, సర్పంచులు ఎ.రెడ్డిరామ్, సైఫుల్లా, ఎంపీటీసీలు, సర్పంచులు, ఏపీవో సుజాత, మండల వ్యవసాయాధికారి జీఆర్ మమతారెడ్డి, ఏపీఎం దేవసేన, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వేణుగోపాల్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ ముజీబర్ రెహమాన్, వీఆర్ ఏఈ అబీద్‌హుసేన్, పంచాయతీకార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్న నారాయణరెడ్డి

కాశినాయన,నవంబర్ 5 (ప్రభాతవార్త):

మండలంలోని మిద్దెల గ్రామానికి చెందిన ఆర్ట్‌ఆఫ్‌లివింగ్ యోగా టీచర్ బి.ఎస్.నారాయణరెడ్డి విజయవాడ అనంతరాయ గ్రంథాలయంలో అబ్దుల్ కలాం లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు అందుకు న్నారు. దక్షిణ భారతదేశంలో స్వచ్ఛందంగా సేవ చేస్తున్న కళాకారులు మరియు సామాజిక కార్యకర్తలను అవార్డులతో సత్కరించడం జరిగిందని, అందులో భాగంగా గత 30 సంవత్సరాలుగా స్వచ్ఛందంగా సమాజసేవ చేస్తున్న తనకు ఈ అవార్డు రావడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ లైఫ్‌టైం అచీవ్‌మెంట్‌తో పాటు ఆయనను గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తనలాంటి వారిని గుర్తించి అవార్డులు అందజేస్తున్నతెలుగు కళారత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ యూవి.రత్నంకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.అలాగే తాను చేస్తున్న సేవా కార్యక్రమాలపై అనాథ శవాలకు అంత్యక్రియలు నిర్వహించడం, పేద పిల్లల విద్యకుఆర్థిక సహాయంతో విద్యకు తోడ్పాటునందించడం, మొక్కలు నాటడం తదితర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటానని ఇప్పుడు తీసుకున్న ఈ అవార్డుతో తన బాధ్యత మరింత పెరిగిందని ఆయన తెలియజేశారు.

మెడిటేషన్‌తోనే మానసిక ప్రశాంతత

బద్వేలు అర్బన్, నవంబరు 05(ప్రభాతవార్త) :

పట్టణంలోని వాసవి అపార్ట్‌మెంటులో మంగళవారం సాయంత్రం కడప నగరానికి చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ చిన్ని సుభాషిణి ఆధ్వర్యంలో మెడిటేషన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వాసవి అపార్ట్‌మెంటుతోపాటు పలువురు పట్టణవాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ పిరమిడ్ మాస్టర్ చిన్ని సుభాషిణి మాట్లాడుతూ ధ్యానంతోనే జ్ఞానం పెరుగుతుందని, జ్ఞానంతోనే ముక్తి లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ మెడిటేషన్ చేయడం వలన మానసిక ప్రశాంతత పొందవచ్చని తద్వారా శారీరక రుగ్మతలకు దూరంగా ఉంటూ ఉత్సాహంగా ఉండగలరన్నారు. మనస్సే అన్నింటికి మూలమని ఆ మనస్సును ధ్యానంతో మనస్సు మన స్వాధీనం చేసుకోవచ్చన్నారు. గత 20 సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల్లో ధ్యాన ప్రచారం చేపట్టి ఎంతోమందికి ఆత్మానందాన్ని కలుగజేశారు. కావున ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చిన్ని లక్ష్మి నారాయణ,మాజీ మహిళా మండలి అధ్యక్షురాలు చింతకుంట ధనమ్మ, పత్తి హేమలత, పత్తిపద్మావతి, ముచ్చర్ల సుధాకర్, సుమలత, కొప్పరపు శర్వాణి, చింతకుంట లక్ష్మి, శిరీష, సూరు సుబ్బారావు, అడ్వకేట్ నాగేంద్రప్రసాద్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

సోమశిల ముంపు జిల్లాలను పరిశీలించిన ఎస్పీ

అట్లూరు,నవంబర్ 05,ప్రభాత వార్త :

సోమశిల ముంపు గ్రామాలైన అట్లూరు మండల పరిధిలోని అట్లూరు గ్రామ పంచాయితీ లోని చింతువాళ్లపల్లి, అకుతోటపల్లె గ్రామాల చుట్టుప్రక్కల సోమశిల వెనుక జలాలను ఎస్పీ బివి రమణా రెడ్డి మంగళవారం పరిశీలించారు. అనంతరం ఇంజనీరింగ్ సిబ్బందితో మరియు ముంపు బాధితులతో మాట్లాడుతూ ప్రస్తుతం సోమశిల జలాశయంలో 70.2టియంసిలు నీటి నిల్వ ఉందని వర్షాకాలం కారణంగా సోమశిల జలాశయంలో 74టియంసిల పూర్తి స్థాయి నీటి మట్టంతో నింపుతామన్నారు. 74 టియంసిల నీటిని నిల్వ చేస్తే ఈ రెండు గ్రామాల పరిధిలోని నివాస గృహాలలోనికి నీరు చేరే విషయమై కడప జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి త్వరగా ఈ రెండు గ్రామాలకు ముంపు నష్ట పరిహారం వచ్చే విధంగా చూస్తామన్నారు. ఈ కార్యక్రమమంలో ఇంజనీరింగ్ అధికారులు ఈఈ ఎంవీ రమణా రెడ్డి, డీఈ శ్రీనివాస్ కుమార్, ఏఈ శివ ప్రసాద్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మిషన్ వాత్సల్యపై అవగాహణ

చాపాడు, నవంబర్ 05, ప్రభాతవార్త:

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు మంగళవారం మిషన్ వాత్సల్యపై సిడిపిఓ ఆధ్వర్యంలో అవగాహణ సదస్సు నిర్వహించారు. ఈ సంధర్భంగా విద్యార్థులకు మిషన్ వాత్సల్య ద్వారా అందిస్తున్న సేవలు బాల వివాహం వల్ల కలిగే పరిణామాలు, ఆడ పిల్లల యొక్క చదువు యొక్క ప్రాముఖ్యత, కిశోర వికాస్ ప్రోగ్రాం, మంచి చెడు స్పర్శలపై, పిల్లల హక్కులపై అవగాహణ అదేవిధంగా 1098 టోల్ ఫ్రీ నెంబర్ పై వివరాత్మక సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బాలల పరిరక్షణ విభాగం అధికారిణి సునీత, సూపర్‌వైజర్‌లు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యం కేసు నమోదు

ముద్దనూరు, నవంబర్ 05, ప్రభాతవార్త:

ముద్దనూరు మండలంలోని మంగపట్నం గ్రామంలో నివాసముండే గోపాల్ రెడ్డి తమ కుమారుడు కనిపించడం లేదని మంగళవారం నాడు సీఐ దస్తగిరికి ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే..బోడెద్దుల జగదీశ్వర్ రెడ్డి వయస్సు 27సంవత్సరాలు ఇంజనీరింగ్ చదువుకొని మధ్యలో చదువు ఆపి తమ తండ్రికి వ్యవసాయంలో సహాయపడేవాడు. గత నెల అక్టోబర్ 5వ తేది తండ్రి గోపాల్ రెడ్డికి కుమారుడు జగదీశ్వర్ రెడ్డి యర్రగుంట్లకు వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాలేదని చుట్టుప్రక్కల గ్రామస్థులు, బంధువులను విచారించిన అతని ఆచూకి తెలియక పోవడంతో తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ ఆదేశాల మేరకు హెడ్ కానిస్టేబుల్ రాంబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇతని గురించి ఎవరికైనా తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి

దువ్వూరు, నవంబర్ 05, ప్రభాతవార్త:

వరి, మినుము పంటల్లో సమగ్ర పంటల యాజమాన్య పద్ధతుల ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని కృషి విజ్ఞాణ కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ వీరయ్య అన్నారు. మంగళవారం దువ్వూరు రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా రైతులకు సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ వరి, మినుము, మొక్కజొన్న, జొన్న పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎరువుల యాజమాన్య పద్ధతులు, తెగుళ్ల నివారణ చర్యలను వివరించారు. అలాగే మినుము పంటను పరిశీలించి వచ్చిన తెగుళ్లపై అవగాహణ కల్పించారు. మండల వ్యవసాయ అధికారి అమర్‌నాథ్ రెడ్డి మాట్లాడుతూ రైతులు తమ పంటల సాగులో సాంకేతిక సమాచారాన్ని వినియోగించుకొని తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా అందజేసే సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో వీహెచ్ఏలు విమత, చరణ్‌లు పాల్గొన్నారు.

పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఏవో

ముద్దనూరు, నవంబర్ 05, ప్రభాతవార్త:

ముద్దనూరు మండలంలోని కొర్రపాడు గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మంగళవారం నాడు నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ మినుము పంటను పరిశీలించి పంట సాగులో మెళకువలు గురించి రైతులకు వివరించారు. రైతులతో కలిసి మినుము పంటను పరిశీలించి అనంతరం పల్లాకు తెగులు నివారణ చర్యలు గురించి రైతులకు వివరించారు. పల్లాకు తెగులు కనిపించిన మొక్కలను గమనించి వెంటనే ఏరి వేసి కాల్చివేయాలని తెలిపారు. అలాగే రసం పీల్చే పురుగు ఉధృతిని అదుపులో ఉంచుటకు ముందు జాగ్రత్తగా వేప నూనె 5యమ్.యల్ ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని తెలిపారు. అలాగే పసుపు రంగు జిగురు అట్టలను ఒక ఎకరా పొలములో 10 నుండి 15అట్టలు ఏర్పాటుచేసుకుంటే మంచి ఫలితం ఉంటుందని తెలిపారు. అలాగే వివిధ పంటల్లో బెట్ట రాకుండా కాపాడుకునేందుకు తేమ సున్నిత దశలను రైతులకు వివరించారు. పంట సాగులో నీటి ఎద్దడి రాకుండా కాపాడుకోవాలని అనంతరం స్ప్రింక్లర్‌తో నీటి తడుల గురించి రైతులను అడిగి తెలుసుకోవడం జరిగింది. పొలము పిలుస్తోంది కార్యక్రమంలో ప్రతి రైతు స్వచ్ఛందంగా పాల్గొని అన్ని విధాల అవగాహణ పొందాలని తెలిపారు. పిఎం కిసాన్ ఈకేవైసీ కానీ రైతులు ఈకేవైసి చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకురాలు యమ్.రాధ మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆర్.రామ సుధ మరియు గ్రామ రైతులు మూలా రెడ్డి, వెదురు సందిరెడ్డి, వి.భాస్కర్‌రెడ్డి, చిరంజీవి రెడ్డి, డి.వెంకట గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

యాజమాన్యపు హక్కు మ్యుటేషన్లతో రాదు
(సివిల్ కోర్టే సరైన పరిష్కార వేదిక-హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు)

బద్వేలు లీగల్, నవంబరు 05 ప్రభాతవార్త :

రెవిన్యూ రికార్డులలో చేసిన మ్యుటేషన్ల వంటి నమోదులతోనే ఆస్తిపై యాజమాన్య ప్రతిపత్తి లేదా హక్కు లభించబోవని హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ఓ కేసులో స్పష్టం చేసింది. రెవిన్యూ రికార్డులలో అలాంటి నమోదులు ఆర్థిక ప్రయోజనాన్ని మాత్రమే అందిస్తాయని, ప్రధానంగా భూమి రెవిన్యూ వంటివి చెల్లించడానికి మాత్రమే వర్తిస్తాయని హైకోర్టు ఇటీవల తన తీర్పులో వెల్లడించింది. యాజమాన్య హక్కుకు సంబంధించిన ఏవైనా వివాదాలు, ముఖ్యంగా వీలునామా వంటి పత్రాల విషయంలో వివాదాలు తలెత్తినపుడు సాధికారత కలిగిన సివిల్ కోర్టు ద్వారా మాత్రమే పరిష్కరించుకోవలసి వుంటుందని హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ధర్మాసనం తేల్చిచెప్పింది. రెండు వీలునామాలపై తలెత్తిన వివాదం కారణంగా ఓ కేసు హిమాచల్ ప్రదేశ్ హైకోర్టుకు చేరగా ఒకటి వివాదాస్పద మ్యుటేషన్‌కు చెందినది కాగా మరొకటి పిటీషనర్లు దాఖలు చేసిన దానికి సంబంధించినవి. సందేహాస్పదమైన వీలునామా ప్రాతిపదికన మ్యుటేషన్ ధృవీకరణ పొందిన కారణంగా రిజిష్టర్ అయిన ఆ వీలునామా దాని ఆధారంగా జరిపిన మ్యుటేషన్, ఈ రెండింటిని సవాల్ చేస్తూ పిటీషనర్లు సివిల్ దావా దాఖలు చేశారు. రిజిష్టర్ వీలునామాను ఆధారంగా చేసుకొని ప్రత్యర్థి పార్టీకి అనుకూలంగా చేసిన మ్యుటేషన్ ఎంట్రీ చెల్లనేరదని, అందువల్ల ఆ మ్యుటేషన్ రద్దు చేయాలని పిటీషనర్లు వాదించగా మ్యుటేషన్ ఆధారంగా వున్న వీలునామా అసలైనది కాదని, అందువల్ల ఈ వీలునామా చెల్లుబాటు, అలాగే మ్యుటేషన్ ఆర్డర్ వంటివి కూడా సివిల్ కోర్టు ద్వారా నిర్ధారణ జరగాలని వారు వాదించగా సివిల్ కోర్టు తీర్పు ద్వారా పార్టీల హక్కులపై స్పష్టత వచ్చే వరకూ ఈ వివాదాస్పద వీలునామా ఆధారంగా ఏదైనా మ్యుటేషన్‌ను తుది పరిష్కారంగా పరిగణించడంగానీ, అలాగే దానికే కట్టుబడి వుండేలా చేయడంగానీ సమంజసం కాదని పిటీషనర్లు వాదిస్తూ ఆస్తి యాజమాన్యంపై వున్న అంతర్లీన వివాదాన్ని సివిల్ కోర్టు మాత్రమే సరిగ్గా పరిష్కరించగలదని పిటీషనర్లు పేర్కొంటూ ఈ మ్యుటేషన్ రద్దు చేయాలని హైకోర్టును అభ్యర్థించారు. ఈ లోగ ఈ సమస్యలో నెలకొన్న సంక్లిష్టతను సివిల్ కోర్టు గుర్తించి కేసు పూర్తిగా పరిష్కారమయ్యే వరకూ దావాలోని ఆస్తి స్వభావము, స్వాధీనత, అన్యాక్రాంతాలకు సంబంధించి స్టేటస్ కో కొనసాగించాలని పార్టీలను ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వును సివిల్ కోర్టు జారీ చేసింది. సూరజ్ భాన్ అండ్ అదర్స్ ఎదిరి ఫైనాన్షియల్ కమీషనర్ అండ్ అదర్స్ కేసులో సుప్రీం కోర్టు గతంలో వెలువరించిన తీర్పును ఈ కేసు విచారణ సందర్భంగా న్యాయమూర్తి ప్రస్తావించారు. వీలునామా చెల్లుబాటును, దాని వాస్తవికతను సాధికార సివిల్ కోర్టు మాత్రమే నిర్ణయించగలదని సూరజ్ భాన్ అండ్ అదర్స్ కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పులో స్పష్టంగా పేర్కొంది. పైగా రెవిన్యూ రికార్డులలో నమోదు, యాజమాన్య ప్రతిపత్తిని దఖలుపరుచబోవని, అలాంటి నమోదుల ప్రయోజనం భూమి రెవిన్యూ చెల్లింపులకే పరిమితమని కూడా సుప్రీం కోర్టు ఆ తీర్పులో స్పష్టంగా పేర్కొంది. దీంతో పిటీషనర్ల కేసులో ఎలాంటి మెరిట్ లేదని హైకోర్టు గుర్తిస్తూ వారి రిట్ పిటీషన్‌ను కొట్టివేసింది. వీలునామా ఆస్తి టైటిల్ సంబంధిత వాస్తవిక సమస్యల పరిష్కారం జరిగే సివిల్ కోర్టులోనే వివాదాస్ప